# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :04 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 17-02-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఏడోరోజు అసెంబ్లీ సమావేశాలు.. వాయిదా తీర్మానం తిరస్కరణ

హైదరాబాద్,తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఏడవ రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలవగానే స్పీకర్ గడ్డం ప్రసాద్ జీరో అవర్‌ను మొదలుపెట్టారు. కాగా.. పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై అసెంబ్లీలో చర్చ జరపాలని, రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు కేంద్రానికి లేఖ రాయాలని బీజేపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. మరోవైపు ఈరోజు సభలో బీసీ కుల గణనపై ప్రభుత్వం తీర్మానం ప్రవేశ పెట్టింది. అలాగే అసెంబ్లీలో ఇరిగేషన్‌పై సర్కార్ శ్వేత పత్రం విడుదల చేయనుంది. ఈరోజు ఇరిగేషన్‌పై స్వల్ప కాలిక చర్చ జరుగనుంది. ఇరిగేషన్‌పై అధికార ప్రతిపక్షాల మధ్య వాడివేడిగా చర్చ జరిగే అవకాశం ఉంది. నిన్న సభలో కాగ్ రిపోర్టును ప్రభుత్వం ప్రవేశపెట్టగా.. కాగ్ రిపోర్టులో కూడా కాళేశ్వరంపై అనేక ఆరోపణలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అనేక అవకతవకలు జరిగినట్లు కాగ్ ప్రస్తావించింది. ఈరోజు ఇరిగేషన్ చర్చలో కాగ్ రిపోర్ట్ ప్రధాన అస్త్రంగా మారనుంది.

## కులగణన తీర్మానానికి అసెంబ్లీలో ఏకగ్రీవ ఆమోదం



హైదరాబాద్,శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేడు కులగణన తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి ఏకగ్రీవంగా అన్నిపార్టీల సభ్యులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కులగణన తీర్మానం ప్రవేశపెట్టడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలపై సర్వే చేస్తామని తెలిపారు. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలనే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. వెనుకబడిన వర్గాల సమాచారాన్ని సర్వే ద్వారా సేకరిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే వివరాలను బహిర్గతం చేయలేదని వెల్లడించారు.ఆ సమాచారాన్ని ఒక కుటుంబం తన దగ్గర దాచుకుందని కీలక వ్యాఖ్యలు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా తాము కులగణన తీర్మానం ప్రవేశపెట్టామని చెప్పారు. దీనిని కూడా ప్రతిపక్షం చర్చను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని అసహనం వ్యక్తం చేశారు. తాను ప్రతిపక్ష నాయకులకు ఒక సలహా ఇస్తున్నానని.. దీనిపై ఎవరికి అనుమానం ఉన్నా నిర్భయంగా ప్రస్తావించొచ్చని అన్నారు. ప్రభుత్వానికి ఏవైనా సూచనలు చేయాలనుకున్నా చేయొచ్చని తెలిపారు. ప్రతిపక్షం ఇచ్చే సహేతుకమైన సూచనలను పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికైనా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి సూచనలు చేయాలని కోరారు.

ఎన్నికలలో మాట ఇచ్చాం.. కుల గణన చేస్తున్నాం

హైదరాబాద్:కుల గణన తీర్మానం పై అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సంపద, రాజ్యాధికారం అంతా కొందరికి వస్తుందని రాహుల్ గాంధీ కుల జనగణన చేద్దాం అన్నారని, ఆయన. చెప్పిన మాట ప్రకారం కుల జన గణన చేస్తున్నామన్నారు. ఇది చరిత్రాత్మక తీర్మానం అన్నారు. రాష్ట్ర ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీని ఇప్పుడు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల వారి వివరాలు సేకరిస్తామన్నారు. ప్రతీ ఇంటిని కులాలను సర్వే చేస్తామన్నారు. ఆర్థిక స్థితి గతులు కూడా సర్వే చేస్తామని తెలిపారు.సర్వరోగ నివారణ లాగా సర్వే ఉంటుందన్నారు. సామాజిక..ఆర్థిక..రాజకీయ మార్పులకు పునాదిగా మారబోతుందని తెలిపారు. మార్పు కోరుకునే వాళ్ళు మద్దతు ఇవ్వాలని కోరారు. సలహాలు ఇవ్వండన్నారు. కుల గణనపై క్లారిటీ తమకు ఉందని, .కన్ఫ్యూజన్ లో మీరు ఉన్నారంటూ కేటీఆర్, కడియం శ్రీహరికి క్లారిటీ ఇచ్చారు. తీర్మానం క్లియర్ గా ఉందన్నారు. ఇల్లు ఇల్లు సర్వే చేస్తున్నామన్నారు. కుల గణన అన్నం .క్లారిటీగా ఉన్నాం.. కన్ఫ్యూజ్ కాకండి అన్నారు. సభను రన్నింగ్ కామెంటరీతో కేటీఆర్.. కడియం కన్ఫ్యూజ్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు నష్టం చేసేలా చేయకండని కోరారు.

## హాట్ టాపిక్ గా హరీశ్..

హైదరాబాద్,గులాబీ బాస్ కు కొత్త కష్టం టైం బాగున్నప్పుడు వారికి తిరుగులేదన్నట్లుగా వ్యవహరించే నేతలు కొందరు ఉంటారు. కానీ.. రివర్సు అయ్యాక మాత్రమే వారి వాస్తవిక బలం ఏమిటో అర్థం కావటమే కాదు.. తమ లోపాలు అర్థమయ్యేలా ఉంటాయి. అధికారం చేతిలో ఉన్న వేళ.. తమ బలాన్ని చూపిస్తూ వాస్తవాన్ని నొక్కేసే అవకాశం ఉంటుంది.

కానీ.. పవర్ చేజారిన తర్వాత ఆటోమెటిక్ గా వారి కంట్రోల్ లో విషయాలు ఉండని పరిస్థితి నెలకొంటుంది. ఇదే విషయం విపక్ష బీఆర్ఎస్ ను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్న వేళలో పార్టీని తన కనుసన్నల్లో నడిపించిన కేసీఆర్.. తన కొడుకు కేటీఆర్ ను తిరుగులేని నేతగా చూపించే వారు. చివరకు హరీశ్ సైతం ఆయన అధికృతకు తగ్గాల్సిన పరిస్థితి. మనసులో ఉన్నది అలానే ఉంచేసుకొని.. కేటీఆర్ తో నడవక తప్పని పరిస్థితి హరీష్ కు ఉండేది. అలాంటి ఆయనకు పార్టీ ప్రతిఫక్షంగా మారిన తర్వాత.. ఇష్యూస్ ను డీల్ చేయాల్సిన అవసరం ఏర్పడింది. గులాబీ పార్టీలో ఎవరి బలం ఏమిటి? ఎవరి బలహీనత ఏమిటన్న విషయంపై మరింత క్లారిటీ వచ్చిన పరిస్థితి. అధికార కాంగ్రెస్ పార్టీతోనే.. ప్రభుత్వాధినేతగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి కారణంగా కేసీఆర్ కు సొంత పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఇబ్బందికరంగా మారుతున్నట్లు చెబుతున్నారు. విపక్ష నేత హోదాలో అసెంబ్లీకి రావటానికి ఇంట్రస్టు లేని కేసీఆర్ కు.. హరీష్ రూపంలో మరో ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ఎందుకంటే అవసరమైన సమయాల్లో మాట్లాడని కేటీఆర్.. అనవసరమైన ఇష్యూస్ లో మాత్రం మాట్లాడుతూ ఇబ్బంది పెడుతున్నారు. కీలకమైన కాళేశ్వరంప్రాజెక్టు మీద చర్చ జరుగుతున్న వేళ.. హరీశ్ ఒంటరిపోరు చేయాల్సి వచ్చింది. ఇరిగేషన్ మంత్రిగా వ్యవహరించిన అనుభవంతో హరీష్ మాట్లాడేందుకు సమర్థించుకున్నా.. కేటీఆర్ తన వంతు కర్తవ్యాన్ని ప్రదర్శించాల్సి ఉంది. కానీ.. అలాంటిదేమీ చేయని తీరును గులాబీ నేతలు తమ ప్రైవేటు సంభాషణల్లో ప్రశ్నిస్తున్నారు. హరీశ్ ను తమ పార్టీలోకి చేర్చుకుంటామని..



మంత్రిగా చేస్తామంటూ కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యలు చేయటం.. తాజాగా హరీశ్ ను బీఆర్ఎస్ అధ్యక్షుడిగా ఎంపిక చేయాలని అదే కాంగ్రెస్ నేతలు మరోసారి మాట్లాడటం లాంటివి కేసీఆర్ కు ఇబ్బందిగా మారుతున్నట్లు చెబుతున్నారు. కాళేశ్వరం ఇష్యూ మీద చర్చల్లో అసెంబ్లీలో ఒంటరిపోరు చేసిన హరీశ్ ను.. సోషల్ మీడియాలో కేటీఆర్ అభినందించిన వైనాన్ని తప్పుపడుతున్నారు. ఒంటరిపోరు చేశారని కేటీఆరే చెబుతున్నారు. మరి.. ఆయనేం చేసినట్లు? అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు కేసీఆర్ తర్వాత పార్టీ ముఖంగా మారిన కేటీఆర్.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం కేటీఆర్ తేలిపోతున్నట్లు చెబుతున్నారు. మొన్నటికి మొన్న సభ నుంచి బయటకు వచ్చి మీడియా పాయింట్ వద్దకు వెళ్లే వేళలో.. మార్షల్స్ అడ్డుకున్న సందర్భంలోనూ హరీష్ గట్టిగా నిలదీయగా.. కేటీఆర్ పక్కన నిలబడి ఉన్నారే తప్ప.. పెద్దగా మాట్లాడలేదు. రోజులు గడుస్తున్నకొద్దీ బీఆర్ఎస్ లో హరీశ్ వెలిగిపోతుంటే.. కేటీఆర్ తేలిపోతున్న పరిస్థితి. ఇప్పటికే చేతినుంచి అధికారం చేజారి ఇబ్బంది పడుతున్న కేసీఆర్ కు పార్టీలో హరీష్ అంతకంతకు ప్రాధాన్యత పెరుగుతున్న వైనం జీర్ణించుకోలేని రీతిలో మారుతుందన్న మాట వినిపిస్తోంది. మరేం జరుగుతుందో చూడాలి.

## బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో హైడ్రామా..

మణికొండ , ఫిబ్రవరి 16: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ లో శుక్రవారం ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. మేయర్ పై గత నెలలోనే అవిశ్వాసం తీర్మానం ఇచ్చి క్యాంపునకు వెళ్లిపోయిన మెజారిటీ అసమ్మతి కార్పొరేటర్లు ఒకవైపు.. మేయర్ అనుకూల మైనారిటీ కార్పొరేటర్లు ఒకవైపు అన్నట్లుగా పరిస్థితి నెలకొంది.వాస్తవానికి కార్పొరేషన్ లో శుక్రవారం అవిశ్వాసంపై ఓటింగ్ జరగాల్సి ఉంది. ఈ సమయం కోసమే నెల రోజులకు పైగా సమయం నుంచి అసమ్మతి కార్పొరేటర్లు 16 మంది క్యాంపులో ఉండడం గమనార్హం. వీరంతా ఓటింగ్ ఉందనుకుని శుక్రవారం కార్పొరేసన్ కు వచ్చారు. అయితే, కోర్టు స్టే ఇచ్చిందని తెలిసి నిరాశకు గురయ్యారు. మరోవైపు న్యాయస్థానం స్టే కారణంగా ఓటింగ్ వాయిదా పడింది. అయితే, ఇది తమ విజయమే అంటూ మేయర్ వర్గం కార్పొరేటర్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో వ్యవహారం మరో మలుపు తీసుకుంది.

మాదే గెలుపు.. కాదు మాదే

ఓటింగ్ జరగకపోవడాన్ని మేయర్ వర్గం తమ విజయంగా పేర్కొంటోంది. జాగీర్ లో ఉన్నది 21 మంది కార్పొరేటర్లు. వీరిలో 16 మంది అసమ్మతి వర్గమే. మిగిలిన ఐదుగురు మేయర్ వెంట ఉన్నట్లు తెలుస్తోంది. కానీ, ఎంతో పట్టుదలగా సాగిన అవిశ్వాసం వ్యవహారం చివరకు వాయిదా పర్వానికి దారితీయడమే ఇక్కడ మలుపు. ఆ పరిణామాన్నే మేయర్ వర్గం తమ విజయంగా గొప్పగా చెబుతోంది. ఈ మేరకు తామే గెలిచామంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టింది. అయితే, అసమ్మతి కార్పొరేటర్లు మాత్రం దీనిని ఎద్దేవా



చేస్తున్నారు. సంఖ్యా బలం రీత్యానే కాదు, నైతికంగానూ తమదే విజయమని పేర్కొంటోంది. వీరంతా ఒక అడుగు ముందుకేసి ఏకంగా బాణసంచా కూడా కాల్చడం గమనార్హం.

ఎట్టకేలకు క్యాంపు వీడి..

మేయర్ పై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించి దాదాపు 34 రోజుల కిందటనే క్యాంపులోకి వెళ్లిపోయారు ఆయనను వ్యతిరేకిస్తున్న కార్పొరేటర్లు. ఇన్ని రోజులూ క్యాంపులోనే ఉంటూ వచ్చారు. ఎన్ని ప్రలోభాలు, ప్రయత్నాలు చేసినా వీరు పట్టు సడలించలేదు. అయితే, శుక్రవారం ఓటింగ్ ఉండడంతో బయటకు వచ్చారు. తీరా అదికాస్త నిలిచిపోవడంతో ఏం చేస్తారో చూడాల్సి ఉంది. మొత్తానికి ఇరు వర్గాల మధ్య సాగిన హైడ్రామా అందరికీ ఆసక్తి కలిగించింది.

## కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేసిన ఐటీశాఖ..



న్యూఢిల్లీ,ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను ఐటీ శాఖ ఫ్రీజ్ చేసింది. పార్టీ అనుబంధ సంఘాలకు చెందిన మొత్తం తొమ్మిది అకౌంట్లను ఆదాయ పన్ను శాఖ విభాగం సీజ్ చేసింది. 2018-19 లో ఆదాయ పన్ను శాఖ విధించిన జరిమానా, నోటీసులకు ఇప్పటి వరకు స్పందించలేదని పేర్కొంటూరీ.. అకౌంట్లు సీజ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ, అనుబంధ విభాగాలకు సమాచారం పంపించింది. ఆధాయ పన్ను శాఖ తీరుపై కాంగ్రెస్ కోశాధికారి అజయ్ మాకెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఎలాంటి చెక్కులను తీసుకోవద్దని ఐటీ శాఖ బ్యాంకులకు ఆదేశాలిచ్చిందని అన్నారు. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్నారంటూ ఆయన మండిపడ్డారు. రూ. 210 కోట్ల పన్ను కట్టాలని ఐటీ డిమాండ్ చేస్తోందని, ఇది రాజకీయ కక్ష సాధింపు చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న విరాళాల చెక్కులు బ్యాంకుల్లో జమ కావడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అకౌంట్లు కాదు.. దేశ ప్రజాస్వామ్యం ఫ్రీజ్ అయిందని మాకెన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అకౌంట్లలో ఉన్న డబ్బు కార్పొరేట్లది కాదు.. కార్యకర్తలు, విరాళాలు, మెంబర్ షిప్ ద్వారా వచ్చిన డబ్బు అని అన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన డబ్బుని బీజేపీ ఖర్చు చేసుకుంటుంది.. కాంగ్రెస్ ఖాతాలను మాత్రం స్తంభింపజేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఒకే పార్టీ ఉండాలా? ఇతర పార్టీలు ఉండొద్దా అంటూ మాకెన్ ప్రశ్నించారు. 2018-19 ఆదాయ పన్ను రిటర్న్ ఆధారంగా ఖాతాలు ఫ్రిజ్ చేశామని చెప్తున్నారని అన్నారు. ఇప్పటికే ఢిల్లీలోని ఇన్ కమ్ ట్యాక్స్ అప్పీలేట్ ట్రిబ్యూనల్ ను (ఐటీఏటీ) కేసు వేశామని తెలిపారు. భారత న్యాయ వ్యవస్థపై మాకు నమ్మకం ఉందని, న్యాయం జరుగుతుందని భావిస్తున్నామని కాంగ్రెస్ కోశాధికారి అజయ్ మాకెన్ చెప్పారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ.. అధికార మత్తులో కూరుకుపోయిన మోడీ ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికలకు ముందు దేశంలోని అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ భారత జాతీయ కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపజేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి గట్టి దెబ్బ అని అన్నారు. బీజేపీ వసూలు చేసిన రాజ్యాంగ విరుద్ధమైన సొమ్ము ఎన్నికల్లో వినియోగిస్తారు.. క్రౌడ్ ఫండింగ్ ద్వారా కాంగ్రెస్ సేకరించిన డబ్బును ఫ్రీజ్ చేస్తారు. అందుకే భవిష్యత్తులో ఎన్నికలు ఉండవని చెప్పాం. ఈ దేశంలో బహుళ పార్టీ వ్యవస్థను కాపాడాలని, భారతదేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మేము న్యాయవ్యవస్థకు విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ అన్యాయం, నియంతృత్వ పాలనపై వీధుల్లోకి వచ్చి గట్టిగా పోరాడతాం అని మల్లికార్జున ఖర్గే అన్నారు.ఇదిలాఉంటే.. కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని మీడియా దృష్టికి తీసుకొచ్చిన గంట తరువాత ఆ పార్టీకి ఉపశమనం లభించింది. అకౌంట్లను ఆదాయ పన్నుశాఖ పునరుద్ధరించింది.

## జర్నలిస్టులకు ఉచిత వైద్యంపై... ప్రొ.కోదండరామ్



హైదరాబాద్,డిజిటల్ మీడియా జర్నలిస్టుల సంఘం ఏర్పాటైన వెంటనే మా సంఘం ప్రతిపాదించిన ముఖ్యమైన డిమాండ్లలో ఉచిత విద్య, వైద్యంపై క్లారిటీ ఇచ్చినందుకు ప్రొ.కోదండరామ్‌కి ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.తెలంగాణ జనసమితి వ్యవస్థాపకులు ప్రొ.కోదండరామ్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టులు విద్య, వైద్యం వంటి కనీస అవసరాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై స్పందిస్తూ జర్నలిస్టులపై ప్రభుత్వాలు సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. జర్నలిస్టులందరికీ వైద్యం అందించడంతో పాటు స్థలాలు కేటాయించాలన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50శాతం రాయితీతో కూడిన విద్యనందించేందుకు ఆమోదం తెలిపినా అమలుకు నోచుకోలేదన్నారు.అలాగే జర్నలిస్టులకు అక్రిడేషన్ తో సంబంధం లేకుండా ఉచిత వైద్యసేవలు అందేలా కృషి చేయాలని, తగిన ప్రతిపాదన తీసుకువస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా ఉందని, త్వరలోనే జర్నలిస్టులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.త్వరలో చట్టసభల్లో పోరాడి జర్నలిస్టులకు తీపి కబురు చెప్పాలని ఆశిస్తున్నాం.

## కనకదుర్గమ్మ సేవలో కేంద్ర రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారు సతీష్ రెడ్డి

ఎన్టీఆర్: ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మను డిపార్ట్మెంట్ ఆఫ్ డిఫెన్స్ ఆర్అండ్‌డి మాజీ కార్యదర్శి, డిఆర్‌డిఓ చైర్మన్, కేంద్ర రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారు డాక్టర్ జి. సతీష్ రెడ్డి దర్శించుకున్నారు. శుక్రవారం అమ్మవారి దర్శనానికి వచ్చిన సతీష్ రెడ్డికి ఆలయ కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనాన్ని కల్పించారు.అమ్మవారికి ప్రత్యేక పూజలను చేసిన అనంతరం సతీష్ రెడ్డికి వేద ఆశీర్వచనలు అందించారు. అలాగే అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి కేఎస్ రామారావు సతీష్ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎన్ రమేష్, వైదిక కమిటీ సభ్యుడు శంకర శాండిల్య,



ఆలయ అధికారులు ఉన్నారు.

## రైతు సంఘాలతో కేంద్రం మూడోరౌండ్ చర్చలు విఫలం..!

న్యూఢిల్లీ, రైతు సంఘాల నేతలతో చండీగఢ్‌లో కేంద్రమంత్రులు జరిపిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. ఇప్పటి వరకు మూడు దఫాలుగా చర్చలు జరిపినా.. సమస్యకు దొరకలేదు. సమావేశంలో హర్యానా ప్రభుత్వం, పోలీసుల చర్యలపై రైతు సంఘాల నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిశీలన కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత ఎంఎస్పీకి చట్టపరంగా హామీ, ఇతర డిమాండ్లపై చర్చించారు. అలాగే, లఖింపూర్ ఖేరి ఘటనతో సహా ఇతర డిమాండ్లపై రైతు నేతలతో ఏకీభవించినట్లు సమాచారం. భేటీలో ఎంఎస్పీ చట్టబద్ధమైన హామీ అమలులో తలెత్తే సమస్యలపై కేంద్రమంత్రులు రైతు సంఘాలకు వివరించారు. అయితే, ఇందులో వెనక్కి తగ్గేది లేదని రైతుసంఘాల నేతలు భీష్మించారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు చర్చలు జరుగుతున్నాయి. సమావేశం అనంతరం కేంద్రమంత్రి అర్జున్ ముండా మాట్లాడుతూ రైతుసంఘాలు, ప్రభుత్వం మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయి. రైతు సంఘాలు లేవనెత్తిన దృష్టిసారించి, పలు సమస్యలపై నిర్ణయం తీసుకున్నామన్నారు.మరోసారి ఆదివారం సమావేశమై శాంతియుత పరిష్కారం కనిపించింది. అనంతరం పంజాబ్ భగవంత్ మాన్ మాట్లాడుతూ రైతుసంఘాలు, కేంద్ర ప్రభుత్వం మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రతి అంశంపై కూలంకషంగా చర్చించారు. అనేక ఏకాభిప్రాయం కుదిరింది. కానీ, పంజాబ్ ప్రజల శాంతిభద్రతలు, సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాలలో శాంతిభద్రతల పరిరక్షణకు హర్యానా ప్రభుత్వాన్ని సూచనల కోసం నిర్ణయించారు. సరిహద్దు ప్రాంతాల



ఇంటర్‌నెట్‌ను నిలిపివేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శాంతియుతంగా కొనసాగుతుందని రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లెవాల్ అన్నారు. తాము ఇంకేమీ చేయమన్నారు. ఢిల్లీ వైపు వెళ్లాలని, సమావేశాలు కొనసాగించడం ఒకేసారి చేయలేమన్నారు. ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసిందని.. అప్పటి వరకు వేచి చూస్తామన్నారు. ఆదివారం సానుకూల ఫలితం రాకుంటే నిరసన కొనసాగిస్తామన్నారు. అదే సమయంలో తమపై హింసాత్మక చర్యలు తీసుకున్నా.. వెనక్కి తగ్గమని పలువురు రైతు సంఘాల నేతలు పేర్కొన్నారు. బలప్రయోగం సరికాదని నేతలు.. తాము భారతీయులమేనని.. పాకిస్థాన్ వాళ్లం కాదంటూ విమర్శిస్తున్నారు.

## సంపాదకీయం

**శనివారం 17-02-2024**

# ప్రేమ పోరాటాలు ఇంకెన్నాళ్లు?

ఆర్థిక సంస్కరణల అనంతరం ప్రపంచం ఒక గ్రామంగా మారింది. ఫలితంగా భారతీయ సమాజం అనేక మార్పులను స్వీకరించింది. కానీ ఒక్క ప్రేమికుల విషయంలోనే మన సమాజ నైజం మారలేదు. దీనికి కారణం పాతుకుపోయిన కుల వ్యవస్థ. ఇది కేవలం మన దేశంలో మాత్రమే ఉంది. ఏ కులంలో పుట్టినవాడు ఆ కులంలోనే వివాహం చేసుకోవాలి. ఈ దుర్మార్గం ఒక్క మన దేశంలోనే ఉంది. అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అని తేడా లేకుండా మనుస్మృతి మానసిక చట్టాలను అమలు చేస్తున్నారు. దీంతో కులం భారతదేశంలో క్యాన్సర్ కంటే ప్రమాదకరమైన జబ్బుగా మారింది. కులం కట్టుబాట్లను తొలగించడానికి దేశంలో అనేక ఆలోచనలు, ప్రణాళికలు రూపొందించబడ్డాయి. కుల నిర్మూలన జరగాలని కలలుకన్న వారి ఆశయాలు నేటికీ నెరవేరలేదు. జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కమ్యూనిస్టులు, నాస్తికవాదులు?కుల నిర్మూలనకు అనేక త్యాగాలు చేశారు. కుల వ్యవస్థ కొనసాగింపు వివాహ వ్యవస్థలోనే దాగి ఉందని గ్రహించారు. కుల నిర్మూలన జరగాలని భారత రాజ్యాంగం నిర్దేశిరచుకున్నది. కుల నిర్మూలనకు కులాంతర వివాహాలు ఓ మెట్టులాగా ఉంటాయని భావించింది. కులాంతర వివాహాలను చేసుకున్న వారిని ప్రోత్సహిస్తూ ప్రభుత్వం కొన్ని పారితోషకాలు కూడా ఇస్తున్నది. అందుకే ఆ రోజుల్లోనే జ్యోతిబా పూలే పూజారి లేని అభ్యుదయ వివాహాలను పూలదండలు మార్చడం ద్వారా జరిపించారు. వారి అడుగుజాడల్లో నేటి పౌర సమాజం అభ్యుదయ వివాహాలను ప్రోత్సహించే సామాజిక బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఉంది. వివాహానికి 21 ఏళ్లు నిండిన యువకుడు, 18 ఏళ్లు నిండిన యువతి ఉంటే చాలు. కులమేదైనా, మతమేదైనా, ప్రాంతమేదైనా, భాష వేరైనా, దేశం వేరైనా ప్రేమించుకొని జీవిత భాగస్వాములుగా వుండే హక్కును రాజ్యాంగం కల్పించింది. వివాహానికి ముందు చూడాల్సింది కులం, మతం కాదు. ఆస్తులు అంతస్తులు అంతకన్నా కాదు. కట్నాలు, డబ్బులు అవసరమే లేదు, గుణం గొప్పదై ఉండాలి. మతం కంటే మానవత్వం ఉండాలి. మ్లలె పువ్వు లాంటి మనసు, కష్టసుఖాల్లో ఒకరికొకరు కంటికి రెప్పలా కాపాడుకోగలరా అనే ఆత్మవిశ్వాసం ఉండాలి. జీవిత కాలం కలిసి ఉండడానికి జీవనోపాధి తప్పనిసరి. రెండు మనసులు కలిసి మానసిక ఐక్యత సాధించిన వ్యక్తులు కేవలం కులం కారణంగా దూరం కాకూడదు. పరస్పరం చర్చించుకుని వాటిపై అంగీకారం కుదిరితే ఆదర్శ వివాహం చేసుకోవడానికి అభ్యంతరం ఉండకూడదు. ఏ అర్హతలు లేకపోయినా పర్వాలేదు కానీ, మా కులం వాడైతే చాలు. అది బాల్యవివాహమైనా లక్షల రూపాయల కట్నాలు పోసైనా, మా కులం వాడికే ఇచ్చి వివాహం చేస్తాను. మా కులం కానీవాడిని ప్రేమిస్తే ఊరుకోం, అవసరమైతే కన్నబిడ్డనైనా కడతేరుస్తాం అనే వారున్న సమాజమిది. తమ కూతురు తక్కువ కులం వాడిని ప్రేమించి పెళ్లి చేసుకున్నదని, తన అల్లుడిని సుపారీ ఇచ్చి నరికి చంపుతున్నటువంటి ఉదంతాలను కళ్లారా చూస్తున్నాం. ప్రేమికులపై ఎందుకింత కుల, మత విద్వేషాలు? నేడు దేశంలో కుల దురహంకార హత్యలు పెరిగిపోయాయి. ఆధిపత్య కులరక్కసి విషపు నాగులాగా బసలు కొడుతున్నప్పుడు కుల దురహంకార హత్యలు పెచ్చరిల్లుతున్నాయి. సమాజాభివృద్ధిని కాంక్షించే సామాజిక ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు అభ్యుదయ వివాహాలకు అండగా నిలుస్తున్నప్పటికీ మెజారిటీ సమాజం మనువాద కుల సంస్కృతి అడ్డుగోడల్ని ఛేదించలేకపోతున్నది. ఇది మారాల్సిన అవసరం ఉన్నది. రాజకీయ పార్టీలు కూడా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. ప్రేమించుకున్న వారిని చేరదీసి ఆదర్శ వివాహాలను జరిపించాలి. కుల, మతాంతర పెళ్లిళ్లను ప్రోత్సహించడం కోసం ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలి. కుల దురహంకారుల పంచన చేరి ప్రేమికులను దూరం చేయరాదు. కుల దురహంకార హత్యలు, దాడుల తర్వాత ప్రేమికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోలీస్ స్టేషన్లకు వెళ్లి తమకు రక్షణ కల్పించాలని దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. వారికి రక్షణ కల్పించాలి. వారి అర్హతను బట్టి ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాధాన్యతనివ్వాలి. ఇంటి స్థలం ఇచ్చి ఇల్లునిర్మించి ఇవ్వాలి. వారి పిల్లల చదువులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. అనేక జీవోలు ఉన్నప్పటికీ అవేవీ అమలుకు నోచుకోవటం లేదు. రాజస్థాన్ ప్రభుత్వం కులాంతర వివాహితుల ప్రత్యేక రక్షణ చట్టం చేస్తూ అసెంబ్లీ తీర్మానించింది. మన తెలుగు రాష్ట్రాలలోనూ అసెంబ్లీ చట్టం చేయాలి. పోలీసు వైఖరిలో కూడా తీవ్రమైన మార్పులు రావాల్సి ఉంది. కేవలం వయసు మాత్రమే గీటురాయిగా పరిగణించి అలాంటి వివాహాలను పోలీస్ స్టేషన్‌లోనే జరిపించి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలి. దాడులకు, దౌర్జన్యాలకు చోటు లేకుండా కుల దురహంకార హత్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజ అభ్యుదయం కాంక్షించే అన్ని రాజకీయ పార్టీలు వారి పార్టీలో ప్రతి ఏటా ఎన్ని కులాంతర వివాహాలు జరిపించారో శ్వేతపత్రం విడుదల చేయాలి. అభ్యుదయ వివాహాలు మన దేశ భవిష్యత్తుకు దోహదం చేస్తాయి. కులరహిత భారత్‌గా రూపుదిద్దుకోవటానికి మొట్టమొదటి మెట్టుగా ఉంటాయి. కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన, పౌర సమాజంపైనా ఉంది.

# ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా జర్మనీ...




న్యూఢిల్లీ, జపాన్‌ను వెనక్కి నెట్టిన జర్మనీ.. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. గత 14 ఏళ్లుగా మూడో స్థానంలో ఉన్న జపాన్..నాలుగో స్థానానికి పడిపోయింది. ఆర్థిక మాంద్యం ప్రభావానికి లోనవుతున్న జపాన్‌ను వెనక్కి నెట్టి జర్మనీ మూడో స్థానంలో నిలిచింది. తాజా గణాంకాల మేరకు గత సంవత్సరం జపాన్ ఆర్థిక వ్యవస్థ 1.9 శాతం జీడీపీ వృద్ధిని నమోదు చేసుకుంది. గత ఏడాది జపాన్ 4.2 ట్రిలియన్ డాలర్ల వాస్తవిక జీడీపీ నమోదు చేసుకోగా.. జర్మనీ 4.4 ట్రినియన్ డాలర్లు నమోదు చేసుకుంది. దేశంలో వృద్ధుల సంఖ్య పెరగడం, పిల్లల సంఖ్య తగ్గడం జపాన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. ఫలితంగా జపాన్ పోటీతత్వాన్ని, ఉత్పాదకతను కోల్పోతోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. డాలర్‌తో పోలిస్తే యెన్ విలువ పతనం కావడంతో జపాన్ ఆర్థిక పరిస్థితి బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే జపాన్ కరెన్సీ 2022లో దాదాపు 20 శాతం క్షీణించగా, 2023లో ఏడు శాతం పడిపోయింది. ఒకప్పుడు అగ్ర రాజ్యం అమెరికా ఆర్థిక వ్యవస్థను ఛాలెంజ్ చేసిన జపాన్.. ఇప్పుడు క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోతోంది. 1990ల నుంచి జపాన్ ఆర్థిక వ్యవస్థ జోరు తగ్గింది. 2010 నాటి వరకు జపాన్ ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చలామణి అయ్యేది. అయితే ఆ దేశాన్ని చైనా వెనక్కి నెట్టి.. రెండో స్థానాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు చైనా ఆర్థిక వ్యవస్థ పరిణామం జపాన్ కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. ఇప్పుడు జపాన్ మరో స్థానాన్ని కోల్పోయి.. జర్మనీ కంటే దిగువన నాలుగో స్థానానికి పరిమితం అయ్యింది. యూరప్ దేశాల్లో జర్మనీ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తోంది. అయితే జర్మనీ ఆర్థిక పరిస్థితి కూడా ప్రస్తుతం కొన్ని ఆటుపోట్లను ఎదుర్కొంటోంది.జపాన్, జర్మనీ ఆర్థిక వ్యవస్థలు నేలచూపులు చూస్తుండగా.. భారత్ ఆర్థిక వ్యవస్థ పైపైకి దూసుకుపోతోంది. కొన్నేళ్లలో జర్మనీ, జపాన్‌లను భారత్ వెనక్కే నెట్టి.. మూడో స్థానానికి ఎగబాకే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ, జపాన్‌ల తర్వాత ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉంది. జర్మనీలో ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయికి చేరుకుంది. ఇంధన ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో ఆర్థిక వృద్ధి నిలిచిపోయింది. జపాన్, జర్మనీ జనాభాలో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. సహజ వనరులు తగ్గుతున్నాయి. ఆ రెండు దేశాలు కార్ల ఎగుమతిలో కఠినమైన పోటీని ఎదుర్కొంటున్నారు. డేటా ప్రకారం, భారతదేశం 2026లో జపాన్‌ను, 2027లో జర్మనీని అధిగమించగలదని అంచనా. కానీ జపాన్ , జర్మనీల్లో నెలకొన్న ప్రతికూల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా భారత్ త్వరలోనే ఈ దేశాలను అధిగమించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఫోర్బ్స్ ప్రకారం, అమెరికా ప్రస్తుతం 27.974 ట్రిలియన్ల డాలర్లతో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. 18.566 ట్రిల్లియన్ డాలర్లతో చైనా రెండో స్థానంలో నిలుస్తోంది. 4.730 ట్రిల్లియన్ డాలర్లతో జర్మనీ మూడో స్థానంలో, 4.291 ట్రిల్లియన్ డాలర్లతో జపాన్ నాలుగో స్థానంలో ఉన్నాయి. భారతదేశం 4.112 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తోంది.

# లక్షాధికారి అక్కలా!



న్యూఢిల్లీ,ఎన్నికల వేళ ఓట్ల కోసం మహిళలను మునగ చెట్టు ఎక్కించేస్తుంటారు పాలకులు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా మీడియాను ఉద్దేశించి (పత్రికా గోష్టి కాదు) ప్రధాని మోడీ మాట్లాడుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే బడ్జెట్ బ్రహ్మాండమైన నారీ శక్తి (మహిళా సాధికారత) అవుతుందని చెప్పారు. నిజానికి ఆమె ప్రవేశపెట్టింది ఓట్ ఆన్ అకౌంట్ తప్ప బడ్జెట్ కాదు. ఎనభై మూడు లక్షల స్వయం సహాయక బందాలలో తొమ్మిది కోట్ల మంది ఉన్నారని, వారిలో కోటి మంది ఎంతో మందికి స్ఫూర్తినిస్తూ చిన్న చిన్న వ్యాపారాలతో లక్షాధికారి అక్కలు (లక్‌పతి దీదీ)గా మారినట్లు, మూడు కోట్ల మందిని లక్‌పతి దీదీలుగా మార్చనున్నట్లు తాత్కాలిక బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ చెప్పారు. దీనికి పండగ చేసుకోవాలని ప్రధాని మోడీ గారు ముక్తాయింపు ఇస్తున్నారు.ఏ దేశంలోనైనా ఎందరు మహిళలు శ్రామికశక్తిలో ఉన్నారన్నది ఒక గీటురాయిగా చూస్తారు. దేశంలో 2022-23లో నియమిత కాల కార్మిక శక్తి సర్వే ప్రకారం మహిళలు అంతకు ముందుతో పోలిస్తే 4.2 శాతం పెరిగి యూజువల్ స్టేటస్ లెక్కింపు అవగాహన ప్రకారం 37 శాతానికి చేరినట్లు కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరు తొమ్మిదిన ప్రకటించింది. ఈ పదానికి అర్థం ఏమిటి ? ఉదాహరణకు సర్వే చేసినపుడు అతడు/ఆమె సదరు ఏడాదిలో తాను ఏడు నెలల పాటు పని చేసినట్లు లేదా పనికోసం అందుబాటులో ఉన్నట్లు గానీ, పని కావాలని కోరినట్లయితే శ్రామికశక్తిలో ఉన్నట్లు లెక్కవేస్తారు. అందుకే ఇది అంకెల గారడీ అని చెప్పాల్సి వస్తోంది. ఒక్కసారిగా ఇంత పెరుగుదల ఎలా సాధ్యమైంది అంటే నరేంద్రమోడీ అమలు జరుపుతున్న నైపుణ్యవృద్ధి, మహిళా అనుకూల విధానాలు, మహిళల నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి ఫలితమని రకీమని చెబుతారు.ప్రభుత్వం ప్రకటించిన సమాచారాన్ని విశ్లేషించిన పరిశోధకులు చెబుతున్న అంకెలకు వీటికి పొంతన కుదరటం లేదు. అందుకే ప్రభుత్వ ప్రకటనలను జుమ్లా (అవసరానికి ఏదో చెబుతుంటాం) అనాల్సి వస్తోంది. ఇండియా టుడే వెబ్‌సైట్ 2023 జూన్ పదకొండున రోషిణీ చక్రవర్తి రాసిన విశ్లేషణకు 'భారత్‌లో తగ్గుతున్న మహిళా శ్రామికులు, ఎందుకు పని చేయటం లేదు?' అనే శీర్షిక పెట్టింది. భారత్‌లో వేతనాలు చెల్లించే ఉపాధిలో మహిళలు ఇరవై శాతానికి లోపుగానే ఉన్నట్లు ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) నివేదికను దానిలో ఉటంకించారు. ఐఎల్ఓ నివేదిక ప్రకారం ఉపాధిలో కేవలం 19.2 శాతం మంది మాత్రమే మహిళలు ఉండగా పురుషుల్లో 70.1 శాతం ఉన్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక లింగ అసమానతల నివేదిక 2022 ప్రకారం 146 దేశాల జాబితాలో 135వ స్థానంలో భారత్ ఉంది. ప్రపంచ శ్రామిక శక్తిలో లింగ సమానత్వం రావాలంటే 132 సంవత్సరాలు పడుతుందని ఆ నివేదిక పేర్కొన్నది. అట్టడుగున్న ఉన్న మన దేశానికి ఇంకా ఎక్కువ వ్యవధి పడుతుందని వేరే చెప్పనవసరం లేదు.అరబ్బు, ఇస్లామిక్ దేశాల్లో ప్రముఖ మీడియా సంస్థ అల్ జజీరా. అది 2023 ఏప్రిల్ పదిన ఒక విశ్లేషణ ప్రచురించింది. 'జనాభాలో భారత్ దూసుకుపోతున్నా శ్రామిక శక్తిలో తగ్గుతున్న మహిళలు' అని పేరు పెట్టింది. ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్న భారత్ మహిళా శ్రామిక శక్తిలో ప్రపంచంలోని అతి తక్కువ 20 దేశాల్లో ఒకటిగా ఉందని, గత కొద్ది సంవత్సరాలుగా తగ్గుతున్నట్లు పేర్కొన్నది. పెరుగుతున్న జనాభాకు ప్రత్యేకించి మహిళలకు ఉపాధిని చూపటంలో విఫలమైతే భారత్‌కు అది గుదిబండగా మారుతుంది. అధికారిక సమాచారాన్ని విశ్లేషించినపుడు 2004లో గరిష్టంగా 35 శాతం మంది మహిళలు ఉపాధి పొందగా 2022 నాటికి అది 25 శాతానికి తగ్గినట్లు అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయానికి చెందిన ఆర్థికవేత్త రోజా అబ్రహం చెప్పిన అంశాన్ని అల్ జజీరా ఉటంకించింది. సిఎంఐఇ ఉపాధి నిర్వచనం ప్రకారం 2022లో పని చేసే వయస్సులో ఉన్నవారిలో కేవలం పదిశాతం మంది మాత్రమే (3.9 కోట్ల మంది మహిళలు మాత్రమే) పని చేస్తూ ఉండటం లేదా పని కోసం ఎదురు చూస్తున్నవారున్నారని, అదే పురుషుల విషయానికి వస్తే 36.1 కోట్ల మంది ఉన్నట్లు పేర్కొన్నది. పని చేయగలిగిన వయస్సు వారి పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి పెరగటం లేదని, గత దశాబ్దిలో మంచి ఉద్యోగాలు గణనీయంగా తగ్గినట్లు, మహిళలు తక్కువ వేతనాలతో పని చేయటం కంటే ఇంటి దగ్గర ఉండి ఇల్లు, పిల్లలను చూసుకోవటం మరింత లాభదాయకమని వారి కుటుంబాలు భావిస్తున్నాయని సిఎంఐఇ డైరెక్టర్ మహేష్ వ్యాస్ చెప్పిన మాటలను ఉటంకించింది.ఇక లక్షాధికారి అక్క (లక్‌పతి దీదీ ) పథకం గురించి చూద్దాం. రెండు కోట్ల మంది లక్షాధికారులైనట్లు నిర్మలమ్మ చెప్పారు. ఈ పథకాన్ని పర్యవేక్షిస్తున్న గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో ఫిబ్రవరి రెండవ తేదీన ఉన్న సమాచారం ప్రకారం స్వయం సహాయక బృందాలలో ఉన్న మహిళలు 9 కోట్ల 17 లక్షల రెండు వేల 245 మంది. వీరిలో ఏడాదికి పాతిక వేల కంటే తక్కువ ఆదాయం వచ్చిన వారు 44,72,431 (ఐదు శాతం) మంది, ఇరవై అయిదు నుంచి 60 వేలకు వరకు వచ్చిన వారు 3,99,16,213 (48శాతం) మంది, అరవై ఒకటి నుంచి లక్ష వరకు రాబడి వచ్చిన వారు 2,43,09,855 (29 శాతం) మంది, లక్షకు పైగా వచ్చిన లక్షాధికారి అక్కల సంఖ్య 1,42,53,969 (17 శాతం)గా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లో ఉన్నాయని చెబుతున్న కనీస వేతనాల ప్రకారం నైపుణ్యం లేని వారికి నెలకు రూ.12,344, నైపుణ్యం కలిగిన వారికి రూ.13,844, అధిక నైపుణ్యం కలిగిన వారికి రూ.14,844 కంటే తక్కువ చెల్లించటానికి లేదు. వీరిలో స్వయం సహాయక బృందాల మహిళలను ఏ తరగతిలో చేరిస్తే ఆ మేరకు ఏడాదికి వారికి రావాల్సిన కనీస వేతనాల రాబడి వరుసగా రూ.1,48,128, రూ.1,66,128, రూ.1,78,128గా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో లక్షాధికారి అక్కల పరిస్థితి చూస్తే 89,56,262 మందిలో ఏడాదికి రూ.పాతికవేల కంటే తక్కువ వచ్చే వారు ఎనిమిది శాతం, పాతిక నుంచి అరవై వేల మధ్య వారు 39, అరవై నుంచి లక్ష వచ్చే వారు 37, అంతకు మించి వస్తున్నట్లు చెబుతున్నవారు 17 శాతం (దేశ సగటుతో సమానం) ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీలను జగన్ సర్కార్ అధిక నైపుణ్యం కలిగిన వారిగా పరిగణించి, తాము ప్రకటించిన కనీస వేతనాలు అమలు జరిపి ఉంటే నలభై రోజులకు పైగా వారు సమ్మె చేసి ఉండే వారు కాదు, లక్షలాది మంది పిల్లలు, పోషకాహారం అందాల్సిన మహిళలను ఇబ్బంది పెట్టి ఉండేవారు కాదు (అంగన్‌వాడీలకు నైపుణ్యం లేకపోతే ఆ బాధ్యతల్లో నియమించరు. ).ఆంధ్రప్రదేశ్‌లో సర్వే చేసిన యాంకర్ పరిశోధన సంస్థ 2022 డిసెంబరులో నివేదించిన ప్రకారం ప్రకాశం జిల్లా గ్రామీణ ప్రాంతాలలో గౌరవ ప్రదమైన జీవనంలో ఒక భోజనానికి అయ్యే ఖర్చును రూ.81.89గా లెక్కించింది. కుటుంబంలో నలుగురు ఉంటే స్కూల్లో ఉన్న పిల్లలకు ఉచిత భోజనం ఉన్నందున ఆ మేరకు తగ్గిస్తే రూ.79.16కు తగ్గుతుంది.ఈ లెక్కన ఒక మనిషికి నెలకు రూ.2,408, కుటుంబానికి రూ.9,632 అవుతుంది. ఇవిగాక బట్టలు, ఇతర అవసరాలను లెక్కిస్తే అవి అదనం. ఆ సంస్థ వేసిన అంచనా ప్రకారం ప్రకాశం జిల్లాలో ఒక కుటుంబానికి గౌరవ ప్రదమైన జీవన రాబడి నెలకు రూ.25,269 ఉండాలని, జీవన వేతనం రూ.16,077 ఉండాలని పేర్కొన్నది.పైన పేర్కొన్న వివరాల ప్రకారం లక్షాధికారి అక్కతో పాటు కుటుంబంలో మరొక సంపాదన వ్యక్తి ఉన్నప్పటికీ వచ్చే రాబడి సరిపోతుందా ? గౌరవ ప్రదమైన జీవనానికి అవసరమైన రాబడి లేదు గనుకనే పోషకాహార లోపంతో పిల్లలు, మహిళలు ఉన్నారు. దానికి పక్కా నిదర్శనం రక్తహీనత ముక్త భారత్‌గా రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపు ఇవ్వటమే. జాతీయ ఆరోగ్య సర్వే 2019-21లో సేకరించిన సమాచారంతో అంతకు ముందు సర్వే వివరాలతో పోలిస్తే దేశంలో ఆర్లే లోపు పిల్లలు, 15-49 సంవత్సరాల మధ్య ఉన్న గర్భిణులు, మొత్తం మహిళల్లో రక్తహీనత పెరిగింది. ఓట్ల కోసం మహిళలను మునగ చెట్టు ఎక్కించాలని చూస్తారు. స్వయం సహాయక బృందాల ద్వారా లక్షాధికారి అక్కలు తయారైతే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ఏలుబడిలోనే మొత్తం పరిస్థితి మారిపోయి ఉండేది. అందువలన తుపాకి రాముడి మాటలను నమ్మితే మరోసారి మోసపోవటమే!

## రెబల్ ఎమ్మెల్యేల విచారణ,చర్యలపై ఉత్కంఠ

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో రెబల్ ఎమ్మెల్యేల విచారణ, చర్యలపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.. తాజాగా మరోసారి స్పీకర్ తమ్మినేని సీతారాంకు లేఖ రాశారు ముగ్గురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రెబల్ ఎమ్మెల్యేలు.. చీఫ్ విప్ ప్రసాద్ రాజు తమకు వ్యతిరేకంగా సమర్పించిన ఆధారాలు ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్ ప్రకారం చెల్లవు అని తమ లేఖలో పేర్కొన్నారు. ప్రసాద్ రాజు సమర్పించిన వీడియోలు ఒరిజినల్ అని ఆయా సంస్థలు నుండి సర్టిఫై కాపీలను తెప్పించాలని.. స్పీకర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు ముగ్గురు వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి.అయితే, ఈ వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలపై లేఖపై స్పందించిన చీఫ్ విప్ ప్రసాద్ రాజు.. రెబల్ ఎమ్మెల్యేలు ఉద్దేశ్యపూర్వకంగానే కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఏవో కారణాలు చెబుతూ విచారణకు హాజరు కావడం లేదని దుయ్యబట్టిన ఆయన.. రెబల్ ఎమ్మెల్యేలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు బహిరంగంగానే ఉందన్నారు. ఇక మరోసారి రెబల్ ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వొద్దు..

# తెనాలిలో వివాహిత హత్య..

అమరావతి,గుంటూరు జిల్లాలో వివాహితను దారుణంగ హత్య చేశారు. గుంటూరు జిల్లా తెనాలి గంగానమ్మపేటలోని స్థానిక భవనం వారి వీధిలో నివాసముంటున్న రామిశెట్టి అలేఖ్య(35)ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. గొంతు కోసి చంపినట్లుగా పోలీసులు గుర్తించారు. గురువారం ఉదయం తన గదిలో రక్తపు మడుగులో పడిఉన్న అలేఖ్యను ఆమె భర్త రమేశ్ గుర్తించారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు ఘటనా స్థలనికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతరాలి భర్త రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్నేళ్లుగా ఆయన భార్యను శ్రీనివాస్ అనే వ్యక్తి వేధిస్తున్నాడని తెలిపారు. అతనిపై కేసు కూడా పెట్టామని చెప్పుడు. ఆమెపై హత్యాయత్నం చేశాడని.. కుటుంబాన్ని చంపుతామని పలుమార్లు బెదిరించాడని తెలిపారు. అతడిపై పెట్టిన కేసులో శిక్ష పడే అవకాశం ఉండటంతోనే ఇంతటి ఘాతుకానికి పాల్పడ్డాడని రమేశ్ పోలీసులకు వివరించాడు. సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున పదునైన ఆయుధంతో గొంతు కోయడంతోనే తీవ్ర గాయమై అలేఖ్య చనిపోయినట్లు తెలిపారు. హత్య జరిగిన విధానం చూస్తే తెలిసిన వ్యక్తులే ఇలా చేసినట్లు తెలుస్తోందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని చెప్పారు.

# ప్రాజెక్ట్ లపై వేలకోట్లు వృధా ఖర్చు

హైదరాబాద్ :అసెంబ్లీ సమావేశాలలో కాగ్ నివేదికను ప్రవేశపెట్టారు.. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ గడ్డంప్రసాద్ మాట్లాడుతూ సభ నడుస్తుండగా మీడియా పాయింట్లో ఎవరూ మాట్లాడకూడదని స్పష్టం చేశారు. బ్రేక్ టైంలో మాత్రమే మీడియా పాయింట్‌లో సభ్యులు మాట్లాడాలని స్పీకర్ ఆదేశించారు. అనంతరం ఉభయ సభల్లో కాగ్ నివేదికను ప్రవేశపెట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ రిపోర్ట్‌ను సర్కార్ సభలో పెట్టింది.ప్రాణహిత ప్రాజెక్టులో ఎలాంటి పురోగతి లేదు దీనికోసం కేటాయించిన 878 కోట్లు నిష్ఫలంగా మారిపోయాయన్నారు. రీఇంజనీరింగ్ పేరుతో డబ్బులు వృధా చేశారన్నారు. ప్రాణహిత మీద..2022 మార్చి నాటికి..1727 కోట్లు కాగా.. కాళేశ్వరంపై 86,788 కోట్లు ఖర్చు.. కాళేశ్వరంపై అంతరాష్ట్ర సమస్యలు.. నిల్వ సామర్థ్యం.. సౌకర్యంపై సరైన అధ్యయనం చేయలేదన్నారు. అస్తవ్యస్తంగా.. పనులు ప్రారంభించారని తెలిపారు. మహారాష్ట్ర లో ముంపు సమస్యను కాగ్ ఎత్తిచూపించింది. ప్రాజెక్టు వ్యయం 122 శాతం పెరిగింది కానీ.. ఆయకట్టు 52 శాతం మాత్రమే పెరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వడ్డీతో సహా 1,47,427 కోట్లకు పెరిగిందన్నారు. ప్రాణహిత ప్రాజెక్టు డీపీఆర్ లేదన్నారు. ప్రాజెక్టు పనుల్లో మార్పుల కారణంగా కొన్ని పనులు నిరార్థకం అయ్యాయి.. ఫలితంగా 767 కోట్లు నష్టం జరిగిందన్నారు. కాళేశ్వరం డీపీఆర్ తయారు చేసిన వ్యాప్కోస్ పని తీరులో లోపాలు ఉన్నాయన్నారు. రీ ఇంజనీరింగ్ పనులు కూడా అదే సంస్థకు అప్పగించారని తెలిపారు. 2018లో కాళేశ్వరం డీపీఆర్ ని కేంద్ర జలసంఘం ఆమోదించక ముందే 17 పనులు.. 25049 కోట్లకు అప్పగించారన్నారు.డీపీఆర్ తరువాత కూడా ప్రాజెక్టు పనుల్లో మార్పులు చేశారని తెలిపారు. తొలుత 2టీఎంసీ ఎత్తిపోతలు ప్రతిపాదించి.. అవసరం లేకున్న 3టీఎంసీలకు ప్రతిపాదన పెంచారని తెలిపారు. దీంతో 28.151 కోట్ల అదనపు వ్యయం. అంచనాలు పాత ధరలతో తయారు చేసి.. పెరిగిన ధరలు మోతాన్ని చేర్చకుండ.. డీపీఆర్ లో ప్రాజెక్టు విలువ తక్కువ చేసి చూపెట్టారన్నారు. ఆ తరవాత మార్పులతో ప్రాజెక్టు విలువ 63,352 కోట్ల నుండి 1లక్ష 2,267 కోట్లకు పెరిగిందన్నారు. భూసేకరణ పునరావాసం మిగిలి ఉందన్నారు. కేంద్ర జలసాంగ్ కి ఇచ్చిన రిపోర్టులో 81,911 కోట్లు ఉందని తెలిపారు. 1,47,427 కోట్లకీ మించిపోయే అవకాశం ఉందన్నారు. కాళేశ్వరంపై ఒక్కో ఎకరాకు అయ్యే మూలధనం వ్యయం 6 లక్షల 42 వేలకు తేలింది. ప్రాజెక్టుతో వచ్చే లాభాలు ఎక్జువ చూపి.. వార్షిక వ్యయం తక్కువ చూపారన్నారు. ఒక్క టీఎంసీ తో 17,668 ఎకరాల ఆయకట్టు వస్తుందని అంచనా వేశారు. ఇతర ప్రాజెక్టులతో పోల్చితే 10వేల ఏకరాలకే సరిపోదన్నారు.కాళేశ్వరం నిర్వహణకు 10వేల కోట్లు పడుతోందని, కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం అంచనాకి మొత్తానికి అనుమతి ఇవ్వలేదన్నారు. ఒక్కో పనికి అనుమతి ఇస్తూ పోయిందని, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పోరేషన్ పేరుతో అప్పులు తెచ్చిందన్నారు. 87,449 కోట్ల రుణాలు తెచ్చింది ప్రభుత్వం అని తెలిపారు. బడ్జెట్ నుండి వచ్చింది కేవలం 27శాతం మాత్రమే కేటాయింపు.. ఖర్చు ఉందన్నారు. కాళేశ్వరంపై ఆదాయం లేదు కాబట్టి రుణాలు చెల్లింపు కష్టం అని కాగ్ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో బడ్జెట్ పై భారం పడుతుందన్నారు. 2020..21 లోనే రుణాల చెల్లింపు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. కానీ 9 అగ్రిమెంట్ లను వాయిదా వేయాలని కోరిందన్నారు. దీంతో వడ్డీల భారం 8,182 కోట్ల అదనపు వడ్డీ భారం పడిందన్నారు. కాళేశ్వరం కోసం తెచ్చిన రుణాలను.. 1,690 కోట్లు మళ్లించారని తెలిపారు. అందనంగా 587 కోట్లు వడ్డీ పడిందన్నారు. ప్రతి ఏటా.. 14 462 కోట్లు రుణాల చెల్లింపు.. వడ్డీకి కేటాయించాల్సి ఉందని, కాళేశ్వరం పనుల్లో 56 పనుల్లో 13 పూర్తి అయ్యాయన్నారు.

# హత్య చేసి యూట్యూబ్ లో చూసి తప్పించుకునే ప్లాన్ ?

వరంగల్, రెండు నెలల కిందట కాజీపేట రహమత్‌నగర్‌లో జరిగిన వృద్ధురాలు కన్నె విజయ (68) హత్యోదంతాన్ని పోలీసులు ఛేదించినట్లు తెలిసింది. హత్య కేసు నిందితులను గుర్తించినట్లు సమాచారం. స్థానికంగా నివాసం ఉంటున్న మహిళనే కన్నె విజయను హత్య చేసి, ఆధారాలు లభించకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. యూట్యూబ్‌లో చూసి ఆధారాలు లభించకుండా చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నిందితురాలి ఇంట్లో గుర్తించిన రక్తపు మరకల ఆధారంగా పోలీసులు కేసు ఛేదించినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. గతేడాది డిసెంబరు 15న రహమత్‌నగర్‌కు చెందిన కన్నె విజయ హత్యకు గురైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో దర్యాప్తు సవాల్‌గా మారింది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టి విజయ కుటుంబ సభ్యులను, కాలనీవాసులను, వలస కూలీలను విచారించారు. సుమారు కాల్ డేటా ద్వారా 60 వేల ఫోన్ కాల్స్‌ను పరిశీలించినా ఒక్క ఆధారం లభించలేదు. చివరికి హతురాలి ఇంటి సమీపంలో నివాసం ఉంటున్న ఓ మహిళ ఇంట్లో లభించిన రక్తపు మరకల ఆధారంగా విచారణ చేసి, ఆమెనే హత్య చేసినట్లు గుర్తించారని తెలిసింది. కన్నె విజయ కుటుంబ సభ్యురాలిపై సమీపంలో నివాసం ఉంటున్న మహిళ నిందలు వేయడంతో గొడవలు జరిగాయి. ఆమెతో పాటు మరో ఇద్దరితో విజయ ఘర్షణ పడ్డారు. మరుసటి రోజే విజయ హత్యకు గురయ్యారు. నిందలు వేసిన మహిళ తన ఇంట్లోనే విజయను తీవ్రంగా కొట్టి చంపి, ఆధారాలు లభించకుండా మృతదేహాన్ని నీళ్లతో కడిగి హతురాలి ఇంటి ముందు పడేసి కుటుంబ సభ్యులపై అనుమానం వచ్చేలా చేసినట్లు సమాచారం.

# రాయబరేలీ వాసులకు సోనియా గాంధీ లేఖ

రాయబరేలీ,కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, ఎంపీ సోనియా గాంధీ తన నియోజక వర్గమైన రాయబరేలీ వాసులకుఒక లేఖ రాశారు. నేడు రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన సోనియా.. ఇన్నాళ్లుగా తమ కుటుంబాన్ని ఆదరించిన రాయబరేలీ వాసులను ఉద్దేశిస్తూ రాసిన ఆ లేఖ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'పెద్దలకు నమస్కారాలు, పిల్లలకు ప్రేమాభినందనలు. రాయ్‌బరేలీతో మా కుటుంబానికి ఉన్న బంధాన్ని మాటల్లో చెప్పలేను. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో మీరు మా మామగారైన ఫిరోజ్ గాంధీని మీ ప్రతినిధిగా లోక్‌సభకు పంపారు. ఆ తర్వాత మా అత్తయ్య ఇందిరా గాంధీనీ మీరు మీ ప్రతినిధిగా ఎన్నుకున్నారు. ఊహించని పరిస్థితిలో నా అత్తగారిని, నా జీవిత భాగస్వామిని కోల్పోయిన తరువాత నేను రాయబరేలీ రావాల్సివచ్చింది. ఆ కష్టకాలంలో మీరంతా నన్ను మీ మనిషిగా అక్కున చేర్చుకున్నారు. నన్ను రెండు సార్లు మీ ప్రతినిధిగా ఎంచుకుని లోక్‌సభకు పంపారు. నేను ఈ రోజు ఈ స్థితిలో ఉండటానికి రాయబరేలీ వాసులైన మీరే కారణం. ఈ కాలంలో నేను నా వంతుగా మీరు నామీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నించాను. పెరుగుతున్న నా వయసు, ప్రస్తుత నా ఆరోగ్య పరిస్థితి కారణంగా నేను వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొంటున్నాను. ఈ విషయం నాకు బాధ కలిగించినా.. నా మనసు మీతోనే ఉంటుంది. ఇప్పటివరకు అనేక విధాలుగా మా కుటుంబానికి అండగా నిలిచిన మీరంతా రాబోయే రోజుల్లోనూ ఇదే రీతిన మాకు అండగా నిలుస్తారని నాకు తెలుసు. త్వరలోనే వచ్చి మిమ్మల్ని తప్పక కలుస్తాను' అని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం సోనియా ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ రాయబరేలీ నుంచి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆమె కుమార్తె, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ పోటీ చేయనున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే ప్రియాంక గాంధీ తొలిసారి పోటీ చేయనున్న స్థానంగా రాయబరేలీ నిలవనుంది. ఆది నుంచి గాంధీ కుటుంబానికి పట్టున్న ఈ స్థానం నుంచే ప్రియాంకా గాంధీ పోటీ చేయాలని కాంగ్రెస్ నేతలు సూచిస్తున్నారు. 2019 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా మోదీ హవా నడిచినా, యూపీలో అది మరింత ప్రబలంగా కనిపించినా.. రాయబరేలీలో మాత్రం సోనియా గెలిచి సత్తా చాటారు. ఎంపీగా సోనియా గాంధీ రాయబరేలీని పారిశ్రామికంగా పరుగులెత్తించారు. కపుర్తల, పెరంబూర్‌లలో ఉన్న రైలు పెట్టెల తయారీ కర్మాగారాలకు అదనంగా మూడవ అధునాతన కర్మాగారాన్ని రాయ్‌బరేలీలో నిర్మింపజేశారు. ఇదిగాక.. ఎన్టీపీసీ, ఎయిమ్స్, నిఫ్ట్, నైపర్, బిర్లా సిమెంట్స్, రాయ్‌బరేలీ టెక్స్‌టైల్ మిల్లు, స్పిన్నింగ్ మిల్లు వంటి అనేక ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలు, సంస్థలను ఏర్పాటు చేయడంతో ఆమెను రాయబరేలీ వాసులు గుండెల్లో పెట్టుకుంటూ వచ్చారు. 1952లో ఫిరోజ్‌గాంధీ, 1967, 1971 లో ఇందిరాగాంధీ ఇక్కడి నుంచి ఎన్నికయ్యారు. 1977లో ఇందిరా గాంధీ.. రాజ్ నారాయణ్ యాదవ్ చేతిలో పరాజయం పాలైనా 1991 ఎన్నికల వరకు కాంగ్రెస్ అభ్యర్థులు ఈ సీటును నిలబెట్టుకుంటూ వచ్చారు. ఈ స్థానంలో 1996, 1998 ఎన్నికల్లో మాత్రమే ఈ స్థానంలో భాజపా గెలిచింది. 2004 నుంచి నేటి వరకు సోనియా గాంధీ ఈ స్థానాన్ని నిలబెట్టుకుంటూనే వచ్చారు.

# తప్పు పట్టిన ఆమ్నెస్టీ

న్యూఢిల్లీ,కేంద్రంలో మోడీ సర్కార్ వచ్చాక బిజెపి పాలిత రాష్ట్రాల్లో ముస్లిం మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని వారి నివాసాల, దుకాణాల, ప్రార్థనా మందిరాల కూల్చివేతలు యథేచ్ఛగా సాగుతున్నాయని ఇంతకాలం ప్రతిపక్షాలు ఆందోళన చెందాయి. కాగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో మత ప్రాతిపదికన బుల్డోజర్, జెసిబిలతో నిర్మాణాల కూల్చివేతపై ఇంటర్నేషనల్ సంస్థ ఆమ్నెస్టీ సాక్ష్యాధారాలతో దేశం ముందు పెట్టింది. కూల్చివేతలపై ఆమ్నెస్టీ తయారు చేసిన రెండు నివేదికల్లోనూ బిజెపి ప్రభుత్వాల ఆటవిక న్యాయాన్ని తీవ్రంగా ప్రశ్నించింది.'బుల్డోజర్ రాజ్'ను తీవ్రంగా తప్పుబట్టింది. బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ఆమ్నెస్టీ ఉత్తినే ఎక్కడో కూర్చొని నివేదికలు తయారు చేయలేదు.

సంఘటనా ప్రదేశాలను సందర్శించింది. ప్రభుత్వ బుల్డోజర్ల కింద ఆస్తులను కోల్పోయిన వందలాది బాధితుల, న్యాయ నిపుణుల, మత పెద్దల, పాత్రికేయుల నుంచి సమాచారం సేకరించింది. వీడియోలను, ఫొటోలను పరిశీలించింది. దేశం వెలిగిపోతోందని, విశ్వగురు అని ప్రచారం చేసుకుంటున్న బిజెపి, మోడీ ఆమ్నెస్టీ చేసిన నిర్ధారణలపై ఏం సమాధానం చెబుతారు?పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)పై దేశ వ్యాప్తంగా నిరసనలు ఎగసిపడ్డాయి. ఆ సమయంలో రాజధాని ఢిల్లీలో ఆందోళనలు మిన్నంటాయి. వాటిలో పాల్గొన్న ముస్లింలు, మద్దతుదారుల ఆస్తులను బుల్డోజర్లు, జెసిబిలు, ఇతర యంత్రాలతో కూలగొట్టిన హృదయవిదారక దృశ్యాలు నేటికీ ప్రజలు మర్చిపోలేదు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగికి 'బుల్డోజర్ బాబా' పేరు సార్థకమైందంటే ఆ రాష్ట్రంలో విద్వేష విధ్వంస పర్వం ఎంత భయానకమో అర్థం చేసుకోవచ్చు. ఏదైనా కేసులో నేరం ఆరోపించబడిన వారి ఆస్తులను నేలమట్టం చేసి రోడ్డున పడేయడం నిత్యకృత్యమైంది. బిజెపి ఏలుబడిలోని అసోం, గుజరాత్, మధ్యప్రదేశ్‌లు యు.పి ని అనుసరిస్తున్నాయి. ప్రభుత్వాలే చట్టాలను తుంగలో తొక్కుతున్నాయి. బాధితులకు కనీసం నోటీసులివ్వట్లేదు. కూల్చివేతల వేళ కనీసం వస్తువులను సైతం తీసుకెళ్లనీకుండా అధికారులు బలప్రయోగంతో అడ్డుకుంటున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులను రోడ్డున పడేస్తున్నారు. రాజ్యం దాడిలో వందలాది కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయి. అవమానాలకు గురవుతున్నాయి. ఈ అమానుషాలకు ప్రభుత్వంలోని ముఖ్యుల ప్రోద్బలం ఉందని ఆమ్నెస్టీ తన విచారణలో కుండబద్దలు కొట్టింది. అందుకు తగ్గట్టుగానే బిజెపి నాయకులు తమ చర్యలను 'బుల్డోజర్ న్యాయం' అని సమర్థించుకుంటున్నారు.ఉత్తరాఖండ్‌లో వాల్ద్వానీ నగరంలో ప్రస్తుతం చెలరేగిన అల్లర్లకు అక్కడి బిజెపి సర్కారే కారణం. బల్‌భూల్‌పురాలో ప్రభుత్వ స్థలంలో కట్టారనే సాకుతో మసీదు, మదర్సాలను అధికారులు నేలమట్టం చేశారు. బాధితులు హైకోర్టును ఆశ్రయించగా, విచారణను 14కు వాయిదా వేసింది. స్టే ఇవ్వలేదన్న తప్పుడు వాదనలతో సర్కారు మసీదు, మదర్సాలపై జెసిబిలు పోనిచ్చి కూల్చిపడేసింది. అందుకు నిరసనగా లేచిన ఘర్షణలలో ఐదుగురు చనిపోయారు. నగరంలో కర్ఫ్యూ విధించారు. బుల్డోజర్లతో ఇళ్లను కూల్చడం అధికారులకు ఫ్యాషనై పోయిందన్న మధ్యప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్యలు అక్కడి బిజెపి ప్రభుత్వ విధ్వంసానికి ఉదాహరణ. మొన్నటికిమొన్న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ట తర్వాత ముంబయిలోని మహ్మద్ అలీ రోడ్డులో అల్లర్లు లేచాయి. అక్కడి 40 నిర్మాణాలను మహారాష్ట్ర సర్కారు కూల్చేసింది. రాజ్యాంగ మూల స్తంభాలలో లౌకికత్వం ప్రధానమైనది. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రభుత్వాలే రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడటం ఆందోళనకరం. అంతర్జాతీయ మానవహక్కుల చట్టం, అంతర్జాతీయ ఒప్పందం (ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులు) బలవంతపు, ఏకపక్ష, కక్షపూరిత, విద్వేష కూల్చివేతలకు వ్యతిరేకం. ఆ చట్టాలనూ బిజెపి ప్రభుత్వాలు కాలరాస్తున్నాయి. ఆమ్నెస్టీ రిపోర్టుతో అయినా బీజేపీ తీరులో కాస్తయినా మార్పు వస్తుందో లేదో చూడాలి!!


# చిత్తూరు జిల్లాలో పొలిటికల్ డ్రామా..

# హాట్ టాపిక్ గా మారిన డీకే ఫ్యామిలీ రాజకీయం..



చిత్తూరు: చిత్తూరు జిల్లా పారిశ్రామిక దిగ్గజం అయిన డీకే ఫ్యామిలి పాలిటిక్స్ ఎవరికీ అంతుపట్టకుండా తయారయ్యాయి. టీడీపీతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన మాజీ ఎంపీ డీకే ఆదికేశవులునాయుడు కుటుంబంలో.. ఇప్పుడు ఒక్కొక్కరు ఒక్కో పార్టీలో కనిపిస్తున్నారు. దివంగత డీకే కూమారుడు డీకే శ్రీనివాస్ వైసీపీ నాయకులతో టచ్‌లో ఉంటే , కూమార్తె తేజస్విణి టీడీపీకి దగ్గరగా కనిపిస్తున్నారు. ఇక ఆయన మనవరాలు చైతన్య జనసేనలో చేరారు. దాంతో వారిలో ఎవరు ఎన్నికల బరిలోకి దిగుతారనేది చిత్తూరులో హాట్ టాపిక్‌గా మారింది.బడా పారిశ్రామికవేత్త అయిన డీకే ఆదికేశవుల నాయుడు చిత్తూరు జిల్లా రాజకీయాల్లో తనదైన బ్రాండ్ వేసుకోగలిగారు. చిత్తూరు పార్లమెంటు సభ్యుడిగా, టీటీడీ చైర్మన్ గా పనిచేయడమే కాకుండా కర్నాటక, ఏపి రాజకీయాలలో చక్రం తిప్పిన దిగ్గజం.. అన్ని పార్టీలకు సహాయ సహకారాలు అందిస్తూ వచ్చిన ఆయన.. ఎంపీగా ఉన్నప్పుడు పార్టీ విప్‌ని ధిక్కరించి టీడీపీ నుంచి సస్పెండ్ అయ్యారు. అయితే డీకే సతీమణి సత్యప్రభ సైతం 2014లో టీడీపీ నుంచి చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిచి.. పార్టీలో యాక్టివ్ పాత్ర పోషించారు. ఆ దంపతుల మరణం తర్వాత రాజకీయాలకు దూరమైన ఆ కుటుంబ సభ్యులు. ఎన్నికల సమీపిస్తున్న వేళ తిరిగి చిత్తూరు నగరంలో యాక్టివ్ అయ్యారు.ఆదికేశవులనాయుడి కూమారుడు డీకే శ్రీనివాస్ తాను ఎన్నికల బరిలో ఉంటానని ప్రకటించారు. డిసెంబర్ , జనవరిల్లో చిత్తూరులో హడావుడి చేశారు. ఆయన టీడీపీ నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. తర్వాత శ్రీనివాస్‌ను మంత్రి పెద్దిరెడ్డితో పాటు వైసీపీ నాయకులు కలిసి తమ పార్టీలోకి ఆహ్వానించారంట. ప్రస్తుతం శ్రీనివాస్ సైలెంట్ అవ్వడంతో.. ఆయన పొలిటికల్ ఎంట్రీపై ఎలాంటి సంకేతాలు రావడం లేదు. పొత్తులు, సీట్ల సర్దుబాట్లపై క్లారిటీ వచ్చాక.. ఆయన బయటకు వస్తారంటున్నారు.ఇక డీకే మనవరాలు చైతన్య ముందుగా టీడీపీ టికెట్ అశించారు. భర్త డాక్టర్ రాజేష్ నాయుడితో కలిసి కాళహస్తి టికెట్ కోసం చంద్రబాబును కలిసి వచ్చారు. మరక్కడ ఏం జరిగిందో? ఏమో? కాని జనసేన కార్యాలయానికి సింగిల్‌గా వెళ్ళి జనసేన కండువా కప్పుకున్నారు. ఆమె భర్త మాత్రం టీడీపీలోనే కొనసాగుతున్నారు. జనసేనలో చేరిన చైతన్య మదనపల్లి, చిత్తూరు జనసేన శ్రేణులతో కలసి వివిధ కార్యక్రమాల్లో కనిపిస్తున్నారు. ఆ రెండు సెగ్మెంట్లలోఒక చోట నుంచి పోటీ చేస్తానంటున్నారు.తాజాగా డికే ఆదికేశవుల నాయుడి పెద్ద కూమార్తె తేజస్విణి కూడా రాజకీయంగా యాక్టివ్ అవుతున్నారు. జీడి నెల్లురులో ఇటీవల జరిగిన చంద్రబాబు బహిరంగ సభకు హాజరై అయునను కలిశారు. తర్వాత పార్టీ నాయుకులతో చర్చలు కొనసాగిస్తున్నారు. త్వరలోనే ఆమె మళ్లీ టీడీపీ అధినేతను కలిసి.. ఎన్నికల్లో పోటీపై స్పష్టత ఇస్తారని అమె సన్నిహితులు చెప్తున్నారు.మొత్తం మీద కుటుంబంలోని ముగ్గురు మూడు పార్టీలతో టచ్‌లో ఉండటం ఆసక్తికరంగా తయారైంది. వారితో పాటు డీకే సోదరుడు బద్రినారాయణ సైతం ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపిస్తున్నారంట. అవకాశం దొరికితే టీడీపీ నుంచి బరిలోకి దిగాలని చూస్తున్నారంట. ఈ ఫ్యామిలీ పాలిటిక్స్‌తో డీకే అభిమానులకు అసలేం జరుగుతుందో అర్థకాకుండా తయారైందంట. 2019 ఎన్నికల సమయంలో డీకే శ్రీనివాస్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు అన్ని పార్టీలు అఫర్ ఇచ్చాయి. అప్పట్లో నిరాకరించిన వారు ఇప్పుడు పోటీకి సిద్ధమవుతుండటం చర్చనీయాంశంగా మారింది.చిత్తూరు టీడీపీలోని ఒక బలమైనా వర్గం నేతల ఒత్తిడితోనే.. డీకే ఫ్యామిలీ తిరిగి పొలిటికల్ ఎంట్రీకి సిద్ధమైందన్న ప్రచారం జరుగుతోంది. ఆదికేశవులనాయుడు టైం నుంచి.. చిత్తూరు నగర టీడీపీ ఆ ఫ్యామిలీ మీదే ఆధారపడి ఉంది. వారు జిల్లాలో ప్రభావితంగా ఉన్న బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు అవ్వడం.. ఆ కమ్యూనిటీపై వారికున్న పట్టు.. ఆ కుటుంబానికి చంద్రబాబుతో ఉన్న సన్నిహిత సంబంధాలు.. ఆర్థిక లెక్కలతో జిల్లా టీడీపీలో వారి ప్రాబల్యమే కొనసాగుతుంది.ఆ ఫ్యామిలీ పాలిటిక్స్‌కి దూరమవ్వడంతో 2019 ఎన్నికల్లో టీడీపీకి చిత్తూరు జిల్లాలో చేదు అనుభవం ఎదురైంది. దాంతో జిల్లా సీనియర్లు మళ్లీ వారిని యాక్టివ్ చేసే పనిలో పడ్డారంటున్నారు. అదీకాక చిత్తూరు అసెంబ్లీ సెగ్మెంట్లో టీడీపీ టికెట్ కోసం ఏకంగా అరడజను మంది పోటీ పడుతున్నారు. వారిలో ఒకరి హడావుడి మరీ ఎక్కువైంది. సదరు నేతలంగా సొంత వర్గాలు మెయిన్‌టెయిన్ చేస్తుండటంతో టీడీపీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. సదరు ఆశావహులకు చెక్ పెట్టి.. పార్టీని ఏకతాటిపైకి తేవడానికే డీకే కుటుంబం చూస్తున్నారంట టీడీపీ నేతలు. మరోవైపు బలిజ సామాజికవర్గానికి వైసీపీ రాయలసీమలో ఒక్క టికెట్ కూడా కేటాయించలేదు. దాంతో ఆ వర్గం నేతలు రగిలిపోతున్నారు.. వైసీపీకి తగిన గుణపాఠం చెప్తామని ప్రకటిస్తున్నారు.ఇప్పుడా వర్గాన్ని ఓన్ చేసుకోవడానికే.. జనసేన, టీడీపీ జిల్లా నేతలు డీకే కుటుంబసభ్యుల్ని కలిసారని.. అందుకే తేజస్విని జనసేనలో చేరారంటున్నారు. మరి డీకే కుటుంబంలోని రెండో తరం నిర్ణయాలు ఎలా ఉంటాయో కాని.. ఆ పెద్దాయన మనవరాలు చైతన్య మాత్రం జనసేన నుంచి మదనపల్లి, చిత్తూరుల్లో ఒక స్థానం నుంచి పోటీలో ఉంటానని హడావుడి చేస్తున్నారు. మరి పొత్తుల లెక్కలు ఎలా ఉంటాయో? డీకే ఫ్యామిలీ పొలిటికల్ ఫ్యూచర్ ఎలా ఉండబోతుందో? చూడాలి.

# చరిత్రలో తొలిసారి...



అమరావతి,తెలుగుదేశం పార్టీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం లేకుండా పోయింది.. 41 ఏళ్ల చరిత్రలో ఆ పార్టీకి ఇలా జరగడం ఇదే తొలిసారి. ఏపీలో రాజ్యసభ స్థానాలకు జరగనున్న ఎన్నికల నుంచి టీడీపీ తప్పుకోవడంతో.. ఆ మూడు స్థానాలు అధికార వైసీపీ ఖాతాలో చేరిపోనున్నాయి. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ఇప్పటికే ఉన్న 8 రాజ్యసభ సీట్లకు అదనంగా మరో మూడు సీట్లు చేరి ఆ పార్టీ సంఖ్యాబలం 11గా మారనుంది. అంతేకాదు.. మరో రెండేళ్ల వరకు పెద్దల సభలో టీడీపీకి ప్రాతినిధ్యం వహించే వారే ఉండరు.ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యసభ రేస్ నుంచి తెలుగుదేశం పార్టీ నిష్క్రమించింది. ఈ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందా ? లేదా ? అన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. వైసీపీ అసంతృప్త ఎమ్మెల్యేలు తమకు మద్దతు పలుకుతారని ఇన్నాళ్లూ భావించిన టీడీపీ.. వారిపై ఆశలు వదులుకుంది. పార్టీ సీనియర్ నేతలతో చర్చలు జరిపిన ఆ పార్టీ చీఫ్ చంద్రబాబు రాజ్యసభకు పోటీ చేసే నిర్ణయాన్ని మార్చుకున్నారు. దీంతో ఏపీలోని మూడు రాజ్యసభ స్థానాలు వైసీపీ ఖాతాలో చేరి.. పెద్దల సభలో వారి సంఖ్యాబలం 11కు మారనుంది.గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో చడీచప్పుడు లేకుండా పోటీకి దిగి, ఒక స్థానాన్ని గెలుచుకున్న తెలుగుదేశం పార్టీ.. ఈసారి కూడా అలాంటి స్ట్రాటజీకి ప్లాన్ చేసిందన్న చర్చ ఇన్నాళ్లూ సాగింది. వైసీపీలో అభ్యర్థుల మార్పు నేపథ్యంలో చాలా మంది అసంతృప్త నేతలుగా మారారు. పైకి కనిపించే వారే 10 మందికిపైగా ఉంటే.. ఇంకా లోలోపల చాలా మంది ఉండొచ్చనే ప్రచారం నడిచింది. ఈ క్రమంలోనే వైసీపీ అసంతృప్త నేతలతో టీడీపీ టచ్‌లోకి వెళ్లడం చర్చనీయాశంగా మారింది.ఈ క్రమంలోనే రాజ్యసభ ఎన్నికలు రావడంతో అది టీడీపీకి అనుకూలంగా మారుతుందని అందరూ భావించారు. ఎన్డీయే కూటమిలో చేరే చర్చలు సాగిస్తున్న చంద్రబాబు.. బీజేపీతో కలిసి తమ వ్యూహాన్ని అమలు చేద్దామని భావించారు. ఈ క్రమంలోనే సీఎం రమేశ్‌ను అభ్యర్థిగా నిలుపుతారన్న ప్రచారం కూడా జరిగింది. ఈ విషయాన్ని ఆయన బీజేపీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లగా.. అందుకు పార్టీ పెద్దలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని వార్తలు వచ్చాయి.

మద్దతు కూడగట్టడం కష్టం?

ఈ క్రమంలోనే రాజ్యసభకు నామినేషన్ వేసేందుకు అసెంబ్లీ సచివాలయం నుంచి దరఖాస్తు సైతం కొనుగోలు చేశారు టీడీఎల్పీ సిబ్బంది. తమ ఎమ్మెల్యేలతో సంతకాలతో నామినేషన్ సిద్ధం చేసి ఉంచారు. గురువారం ఆఖరు కావడంతో ఆరోజు నామినేషన్ వేయాలని ముందుగా అనుకున్నారు.అయితే.. టీడీపీ అధినేత చంద్రబాబు మాత్రం ఈ విషయంలో అనేక విధాలుగా ఆలోచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం నలుగురు ఎమ్మెల్యేలతో తమ పని సులువుగా కానిచ్చిన టీడీపీ.. రాజ్యసభ ఎన్నికల్లో 25 నుంచి 26 మంది మద్దతు కూటగట్టడం కష్టమనే చర్చ నడిచింది. పైగా సార్వత్రిక ఎన్నికలకు ముందు రాజ్యసభ ఎన్నికలపై దృష్టి పెట్టడం వల్ల విలువైన సమయం వృథా అవుతుందని పార్టీ నేతలు కూడా సూచించారు.

సార్వత్రిక ఎన్నికలపై ప్రభావం

దాదాపు 10 రోజులపాటు ఈ ఎన్నికలపైనే దృష్టి పెట్టడంతో పాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలను ఆకర్షించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో తేడా జరిగినా అది సార్వత్రిక ఎన్నికలపై ప్రభావం చూపుతుందనే అనుమానం టీడీపీలో వ్యక్తమైంది. టీడీపీ సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ లాంటి నేతలతో బుధవారం సమావేశమైన చంద్రబాబు.. వారి సలహాలు తీసుకున్నారు.వారందరి సూచన మేరకు రాజ్యసభ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో వైసీపీ ముగ్గురు అభ్యర్థులకు లైన్ క్లీయర్ అయ్యింది. టీడీపీ పోటీ నుంచి తప్పుకోవడంతో పూర్తిస్థాయి సంఖ్యాబలం ఉన్న వైసీపీకే మూడు రాజ్యసభ స్థానాలు దక్కనున్నాయి. ఇప్పటికే ఏపీలో అధికార పార్టీకి 8 మంది రాజ్యసభ సభ్యులుండగా.. కొత్తగా చేరనున్న ముగ్గురితో కలిపి వీరి సంఖ్య 11కు చేరనుంది. ఈ క్రమంలో మరో రెండేళ్ల వరకు టీడీపీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం లేకుండా పోనుంది.

# ఇది ప్రజాప్రభుత్వం.. ప్రజలకు సేవచేయడమే మా లక్ష్యం

హైదరాబాద్,తెలంగాణలో ఆర్థిక, సామాజిక అసమానతలు ఉన్నాయ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసమానతలు తొలగించేదుకు బడ్జెట్ ద్వారా కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని.. ప్రజలకు సేవచేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సామాజిక సమానత్వంలో భాగంగా బడ్జెట్‌లో కేటాయింపు చేశామని ఆయన తెలిపారు. గతంలో ఏటా బడ్జెట్‌ను 20 శాతం పెంచుకుంటూ పోయారన్నారు.గత ప్రభుత్వం రాజస్థాన్‌లో బడ్జెట్ కంటే అధికంగా ఖర్చు పెట్టారని ఆయన తెలిపారు. రాజస్థాన్‌లో రూ.2.5 లక్షల కోట్లు బడ్జెట్ పెడితే గత ప్రభుత్వం రూ.2.9 లక్షల కోట్లు ఖర్చు పెట్టారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గతంలో మాదిరిగా 20 శాతం అధికంగా బడ్జెట్ పెడితే ప్రమాదంగా మారుతుందన్నారు. రాష్ట్రంపై ప్రస్తుతం మొత్తం రూ. 7.11 లక్షల కోట్ల అప్పుల భారం ఉందన్నారు. సింగరేణిలో కారుణ్య నియామకాలు పూర్తి చేస్తామని భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా 16 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేశారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం పూర్తిగా అభద్దాలతో బడ్జెట్ ను ప్రవేశపెట్టారన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే బతుకులు బాగుపడతాయని ప్రజలు భావించారని భట్టివిక్రమార్క అన్నారు. కానీ గత పాలకులు హామీలు అమలు చేయకపోవడం వల్ల అలాగే ఉండిపోవాల్సి వచ్చిందన్నారు.

# తమిళనాడులో బీజేపీ కార్యకర్త దారుణహత్య

మధురై, తమిళనాడులో బీజేపీ కార్యకర్త దారుణహత్యకు గురయ్యాడు. మధురైలో బీజేపీ ఓబీసీ విభాగం నేత గురువారం ఉదయం గుర్తుతెలియని దుండగులు కత్తితో పొడిచి హత్య చేశారు. హత్యకు గురైన వ్యక్తిని శక్తివేల్‌గా గుర్తించారు. బీజేపీ ఓబీసీ విభాగం జిల్లా కార్యదర్శిగా ఉన్న ఈయన గురువారం ఉదయం ఫైనాన్సింగ్ పనిలో నిమగ్రమై ఉండగా.. సాంగు నగర్‌లోని గోదాం వద్దకి వెళ్తున్న క్రమంలో దాడి జరిగింది. శక్తివేల్ వల్లనాథపురంలోని తన ఇంటి నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఉదయం 6 గంటలకు ఈ దారుణం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, దుండగుల బృందం అతనిని వెంబడించి, దారుణంగా దాడి చేసి హత్య చేశారు. దీనిపై అన్నానగర్ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. బాధితుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, రాజాజీ ప్రభుత్వ ఆసుపత్రికి శవపరీక్ష కోసం పంపారు. అయితే, గూడ్స్ క్యారియర్ విక్రమానికి సంబంధించి శక్తివేల్‌కి ఇటీవల తలెత్తిన వివాదంతో ఈ హత్యకు ఏమైనా ప్రమేయం ఉందా..? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

# దొంగాటకు సుప్రీం చెక్..!

న్యూఢిల్లీ, మోదీ ప్రభుత్వం 2018లో ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టిన తర్వాత సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం నేడు సంచలన తీర్పునిచ్చింది. ఈ బాండ్ల వ్యవహారంలో విరాళాల వివరాలను వెల్లడిచేయకపోవటం అనైతికమని, రాజ్యాంగ విరుద్ధమని, ఇది క్విడ్ ప్రోకో వంటిదేనని, వాటిని తక్షణం నిలిపివేయాలని సర్వోన్నత న్యాయస్థానం కేంద్రానికి మొట్టికాయలు వేసింది. ఇప్పటి వరకు ఆయా పార్టీలకు వచ్చిన బాండ్ల వివరాలను దేశం ముందుంచాల్సిందేనంటూ స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

అంతా మాయే..

రాజకీయ పార్టీలకు అందే నిధుల్లో పారదర్శకత తీసుకువచ్చే ప్రయత్నాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. 2018 జనవరి 2న అమల్లోకి తీసుకొచ్చిన ఎలక్షన్ బాండ్ల చట్టం ప్రకారం.. ప్రజలతోపాటు సంస్థలు కూడా ఈ బాండ్లను కొనుగోలుచేసి రాజకీయ పార్టీలకు విరాళంగా అందిచొచ్చు.కానీ.. అసలు ఈ బాండ్లు ఎవరు కొంటున్నారు? ఎవరికి వీటిని ఇస్తున్నారు? లాంటి వివరాలను ప్రజలు మాత్రం తెలుసుకునే అవకాశం లేదు. పార్టీలు తమకు వచ్చిన విరాళాలను వెల్లడి చేయాల్సిన అవసరం లేకుండా కేంద్రం ఆర్థిక చట్టం – 2017 సవరణ చేసింది.ఎన్నికల బాండ్ల ద్వారా కొత్త రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు నిధులు అందుకోవటం కుదరదు. అంతేగాక.. ఎన్నికల బాండ్ల పథకాన్ని బడ్జెట్‌లో భాగంగా 'మనీ బిల్' పేరుతో తీసుకొచ్చారు. దీనివల్ల ఇందులో మార్పుల చేయడానికి రాజ్యసభకు వీలులేకుండా పోయింది.గతంలో కంపెనీల చట్టం ప్రకారం మూడేళ్లలో వచ్చిన సగటు లాభాలపై కంపెనీ బోర్డు అనుమతితో 7.5 శాతం మాత్రమే పార్టీలకు విరాళాలు ఇచ్చే అవకాశం ఉండేది. కంపెనీ వార్షిక నివేదికలోనూ ఏ పార్టీకి నిధులు ఇచ్చారో వెల్లడించాలి. కానీ.. మోదీ ప్రభుత్వం ఈ కంపెనీల చట్టానికి చేసిన సవరణ చేసింది. దీని ప్రకారం.. ఈ రోజు మొదలైన కంపెనీ కూడా మర్నాటి నుంచే రాజకీయ పార్టీలకు నిధులు ఇవ్వొచ్చు. అంతేకాదు.. కంపెనీ బోర్డు అనుమతి కూడా అవసరం లేదు. వార్షిక నివేదికల్లో వెల్లడించాల్సిన అవసరమూ లేదు. విదేశీ కంపెనీలు కూడా తమ భారతీయ అనుబంధ సంస్థల ద్వారా విరాళాలు ఇవ్వవచ్చు.గతంలో ప్రతి రాజకీయ పార్టీ తమ విరాళాల గురించి లెక్కలు చెప్పాలని, ఎవరిచ్చారో వివరించాలని ఆదాయ పన్ను చట్టం నిర్దేశించేది. ఇప్పుడు పార్టీలు ఎన్నికల బాండ్ల గురించి రికార్డులు తయారు చేయనక్కర్లేదు. కంపెనీల చట్టం, ఆదాయపన్ను చట్టం, ప్రజా ప్రాతినిధ్యం చట్టం లాంటి చట్టాలనుంచి ఎన్నికల బాండ్లకు మినహాయింపు లభించింది.

అభ్యంతరాలు..

ఎలక్షన్ కమిషన్ వాదన ప్రకారం.. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 33ఏ ప్రకారం.. ఒక ఓటరు ఒక అభ్యర్థికి ఓటు వేసే ముందు ఆ అభ్యర్థి నేపథ్యం గురించి తెలుసుకునే హక్కుంది. ఆ అభ్యర్థి నేరచరిత్రను కూడా తెలుసుకునేందుకు ఓటరుకు హక్కుంది. అలాగే.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) క్రింద రాజకీయ పార్టీలకు ఎవరు నిధులు సమకూరుస్తున్నారనే విషయమూ తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది.రాజకీయ పార్టీలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలుసుకునే ఛాన్స్ లేకపోవటంతో తమకు ఎలక్షన్ ప్రక్రియ మీద పట్టు లేకుండా పోయిందని, దీనివల్ల షెల్ కంపెనీల ద్వారా ఎన్నికల బాండ్ల ప్రక్రియను దుర్వినియోగం చేస్తాయని ఎన్నికల కమిషన్ సుప్రీంకోర్టుకు తెలిపింది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టాని (ఎఫ్‌సిఆర్ఏ)కి మార్పులు చేయడంతో.. పార్టీలకు అడ్డూ ఆపు లేకుండా విదేశీ నిధులు ప్రవహించే అవకాశాలున్నాయని, దీనివల్ల భవిష్యత్తులో ఆ విదేశీ కంపెనీలు మన విధానాలను ప్రభావితం చేస్తాయని కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది.

అన్నీ అనుమానాలే..

ఎలక్షన్ బాండ్ల ద్వారా నేటి వరకు వచ్చిన మొత్తంలో దాదాపు 75 శాతం భారతీయ జనతా పార్టీకే దక్కింది. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, ఏపీలో వైసీపీలు అక్కడి ప్రతిపక్ష పార్టీల కంటే ఎక్కువ సొమ్ము ముట్టింది. వెయ్యి రూపాయల నుంచి కోటి వరకు వేర్వేరు కేటగిరీల్లో ఉన్న ఈ విరాళాల్లో 95 శాతం మొత్తం.. కోట్ల రూపాయలలో జరిగింది. ఈ మొత్తం కట్టిన వారికి పన్ను మినహాయింపు కూడా లభించింది.అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ప్రకారం.. 2016–17 నుంచి 2021–22 మధ్య బాండ్ల రూపంలో బీజేపీకి రూ.5,127.97 కోట్ల విరాళాలు అందగా, మిగతా అన్ని జాతీయ పార్టీలకు కలిపి కేవలం రూ.1,783.93 కోట్లు మాత్రమే వచ్చాయి.ఇక.. భారీ అప్పులతో తీవ్ర సంక్షోభంలో ఉన్న వేదాంత అనే కంపెనీ రాజకీయ పార్టీలకు బాండ్ల ద్వారా రూ. 457కోట్లు విరాళాలు సమకూర్చిందనీ, ఇదెలా సాధ్యమని అసోసియేషన్ ఆఫ్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ కోర్టుకు తెలిపింది. ప్రభుత్వ విధాన నిర్ణయాలను ప్రభావితం చేసేందుకు ముడుపుల రూపంలో ఈ బాండ్లు కొంటున్నారని సంస్థ వెల్లడించింది.


చాగ్లా తీర్పు శిరోధార్యం

ముంబై హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎంసి చాగ్లా కార్పొరేట్లు ప్రజాస్వామ్య ప్రక్రియల పరిధిలోకి ప్రవేశించరాదని 1958లోనే తీర్పునిచ్చారు. ప్రజాస్వామ్య సంస్థల పనితీరును బడా వ్యాపార సంస్థలు, డబ్బు సంచులు ప్రభావితం చేయకూడదన్నారు. బడా పారిశ్రామిక సంస్థలు తమకు అనుకూలంగా విధానాలు మార్చేందుకే రాజకీయ పార్టీలను పెంచి పోషిస్తాయి కనుక దాన్ని అవినీతి క్రిందే భావించాలని ఆయన చెప్పారు.

# భారతీయుల్ని బహిష్కరించిన మాల్దీవ్స్

న్యూఢిల్లీ, : మాల్దీవుల్లో కొత్త అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు వచ్చిన తర్వాత నుంచి భారత్ వ్యతిరేఖ, చైనా అనుకూల ధోరణిని అవలంభిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి మంత్రులు భారత ప్రధాని మోడీపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. మాల్దీవ్స్‌కి పర్యాటకంగా ఎక్కువ వెళ్లే భారతీయులు వారి టూర్లను క్యాన్సిల్ చేసుకున్నారు.

# ఎలక్షన్ బాండ్ల పేరుతో దొంగాటకు సుప్రీం చెక్




న్యూఢిల్లీ, రాజకీయ పార్టీలకు ఎలక్షన్ బాండ్ల పేరుతో విరాళాలు ఇవ్వటం క్విడ్ ప్రోకో కిందకే వస్తుందని సుప్రీం కోర్టు కాసేపటి క్రితం సంచలన తీర్పునిచ్చింది. సదరు విరాళాలు ఇచ్చిన దాతల పేర్లు రహస్యంగా ఉంచటం తగదని, 2019 నుంచి వచ్చిన ఆ విరాళాల వివరాలను, దాతల పేర్లను వెల్లడించాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఎలక్షన్ బాండ్లమీద దేశవ్యాప్తంగా మారోసారి చర్చ జరుగుతుతోంది. ఇంతకీ ఈ బాండ్లు ఏమిటి? వీటి నేపథ్యమేమిటో ఓసారి అవలోకిద్దాం. ఎన్నికల సంస్కరణల్లో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల బాండ్లను తీసుకొచ్చింది. 2017 ఆర్థిక బిల్లు ద్వారా ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టారు. 2018లో ఇవి అమల్లోకి వచ్చాయి. నల్లధనం, అవినీతిని అరికట్టేందుకు.. రాజకీయ పార్టీలకు విరాళాల విషయంలో పారదర్శకత తీసుకొచ్చేందుకు వీటిని తీసుకొచ్చామని అప్పట్లో చెప్పింది.బ్యాంక్ ద్వారా జారీ అయ్యే ఈ వడ్డీరహిత ఎన్నికల బాండ్లను డోనర్(దాత) కొనుగోలు చేస్తారు. చెక్కు లేదా డిజిటల్ పేమెంట్ ద్వారా ఇది జరుగుతుంది. విరాళాలిచ్చేవారి రక్షణ కోసమే ఇది. ఈ గోప్యత పాటించకుంటే.. ప్రధానంగా డోనర్లు వాణిజ్యవేత్తలైన పక్షంలో రాజకీయ వివాదాలు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. ఆ బాండ్లను తనకు నచ్చిన పార్టీకి డోనర్ విరాళంగా అందజేస్తారు. ఎన్నికల సంఘంలో నమోదైన రాజకీయ పార్టీలు ఆ బాండ్లను 15 రోజుల్లోగా నగదుగా మార్చుకుని తీరాలి.రాజకీయ పార్టీలకు గతంలో దొడ్డిదోవ పద్ధతుల్లో విరాళాలు అందేవి. ఇది అవినీతి, నల్లధనానికి దారి తీస్తుందనే వాదన మొదలైంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా ఎన్నికల బాండ్లు వచ్చాయి. అయితే ఈ పథకంలో కొన్ని నిబంధనలను గమనిస్తే.. పారదర్శకత నీటిమూటలాగే కనిపిస్తుంది. నగదు మూలాల గురించి డోనర్(వ్యక్తి/సంస్థ) వెల్లడించాల్సిన అవసరం లేదనేది ఓ నిబంధన. రాజకీయ పార్టీలు కూడా ఆ విరాళాలు ఎక్కడ నుంచి వచ్చాయో చెప్పాల్సిన అవసరం లేదు. ఇలా కొనుగోలు చేసిన బాండ్లను డోనర్లు ఏ రాజకీయ పార్టీకి అందజేశారన్నవిషయం వారు వెల్లడిస్తే తప్ప బయట ప్రపంచానికి తెలియదు.తమ లాభనష్టాల నివేదికలో కంపెనీలు ఈ ఎన్నికల బాండ్లను చూపించనక్కర్లేదు. పైగా కార్పొరేట్ విరాళాలు 7.5% మించరాదన్న సూత్రం ఈ బాండ్ల విషయంలో వర్తించదు. అలాగే కంపెనీలు ఏవైనా 3 ఏళ్లుగా మనుగడలో ఉంటే.. రాజకీయ పార్టీలకు విరాళాలు అందజేసేందుకు అర్హత ఉన్నట్టే. డొల్ల కంపెనీలకు ఊతమిచ్చేందుకు ఇది పరోక్షంగా దోహదపడుతుందనేది సుస్పష్టం. నల్లధన ప్రవాహానికి ఇదో రాచమార్గంగా మారిందనేది అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) వాదన. ఎన్నికల బాండ్లను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో ఏడీఆర్ 2017లో పిటిషన్ వేసింది. 2019, 2021లలో బాండ్ల జారీపై స్టే కోరినా .. సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్బీఐ మాత్రమే బాండ్లను జారీ చేస్తుంది కాబట్టి.. కొనుగోలుదారుల వివరాలను తెలుసుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. అధికారంలో ఉన్న పార్టీలు ఈ సమాచారాన్ని తమకు అనువుగా వినియోగించుకునే ప్రమాదమూ ఉంది. లెక్కలకు మించి ఆదాయం ఉన్న సంస్థలు/వ్యక్తులు బాండ్లను విరాళంగా అందజేసి.. అధికార పార్టీలను ప్రసన్నం చేసుకునే సౌలభ్యం ఈ పథకంలో ఉండటం గమనార్హం. బాండ్ల ద్వారా విరాళాలు అందుకోవడంలో అధికార పార్టీలదే అగ్రస్థానమనేది సుస్పష్టం. ఏడీఆర్ తన పిటిషన్లో ఎన్నో విషయాలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీలు సమర్పించిన ఆడిట్ నివేదికలు, ఆదాయపన్ను నివేదికలను పరిశీలిస్తే ఎన్నికల బాండ్లతో అధిక లబ్ధి చేకూరింది బీజేపీకేనని తెలుస్తోంది. ఏడీఆర్ నివేదిక మేరకు 2019-20లో బీజేపీ అత్యధిక మొత్తంలో(రూ. 1651.022 కోట్లు) ఖర్చు చేసింది. కాంగ్రెస్(రూ. 998.158 కోట్లు), టీఎంసీ(రూ. 107.277కోట్లు) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఆ ఏడాది రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్న బాండ్ల విలువ రూ. 3429.56 కోట్లు. ఆ మొత్తంలో నాలుగు ప్రధాన రాజకీయ పార్టీలు(బీజేపీ, కాంగ్రెస్, టీఎంసీ, ఎన్సీపీ) 87.29% మేర దక్కించుకున్నాయి. అనేక దేశాలు ఎన్నికల్లో బ్లాక్ మనీ ప్రభావాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని కేంద్రం సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. భారత్ లో నల్లధనాన్ని అరికట్టడానికి డిజిటల్ పేమెంట్ విధానం అమలు చేస్తున్నామని తెలిపింది. 2.38 లక్షల డొల్ల కంపెనీలపై యాక్షన్ తీసుకున్నామని పేర్కొంది. వైట్ మనీ రాజకీయ పార్టీలకు విరాళాలుగా అందేలా చేయడానికి ఎన్నికల బాండ్ల పథకం ఉద్దేశమని చెప్పింది. అధికార పార్టీకే అధిక విరాళాలు ఎందుకు వెళ్తున్నాయని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రశ్నించారు. కారణమేంటని ప్రశ్నించారు. ఎన్నికల బాండ్ల ద్వారా సమకూరిన నిధులను ఎన్నికల సంఘం వద్ద ఉంచి.. అన్ని పార్టీలకు సమానంగా పంపిణీ చేయాలని సూచించారు. అప్పుడు అసలు విరాళాలే రావని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమాధానమిచ్చారు. ఈ పిటిషన్లపై కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సుప్రీంకోర్టులో అఫిడవిట్ సమర్పించారు. ఎన్నికల బాండ్ల నిధుల మూలాలకు సమాచారం తెలుసుకునే హక్కు దేశ ప్రజలకు లేదని ఈ అఫిడవిట్ లో పేర్కొన్నారు.

# కేసీఆర్ ఎందుకు అసెంబ్లీకి వెళ్ళడం లేదు?

హైదరాబాద్,ఫిల్లర్లు కుంగిపోతే కొంపలు మునిగిపోయాయా అంటారా..? అని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ కేసీఆర్ పై ఫైర్ అయ్యారు. కేసీఆర్ అహంభావం, అవినీతి వల్లే.. ఉద్యమ పార్టీకి కూడా ప్రజలు బుద్ధి చెప్పారని తెలిపారు. ఫిల్లర్లు కుంగిపోతే కొంపలు మునిగిపోయాయా అనడమేంటి కేసీఆర్ అంటూ మండిపడ్డారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా చేశావా.. చెపరాసి నౌకరీ చేశావా? అని ప్రశ్నించారు. అసెంబ్లీకి ఎన్నికైన శాసనసభ్యులు శాశ్వతంగా రామని బైకాట్ చేయడమెంటి అంటూ మండిపడ్డారు. కేసీఆర్ ఎందుకు పోటీ చేశారు.. ఎందుకు అసెంబ్లీకి వెళ్ళడం లేదు? అని ప్రశ్నించారు. ప్రజా సంపాదనను పందికొక్కులా తింటూ అసెంబ్లీకి పోవడం లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అసెంబ్లీ నుంచి గెంటివేసిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. తెలంగాణ భాజపా బాగా తెలివైనది.. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై సిబిఐకీ అప్పగించాలని కోరుతుందన్నారు. సీబీఐకి కేసు అప్పగించి మ్యానేజ్ చెయ్యాలి అనుకుంటుందన్నారు. తెలంగాణ బిజెపి కేసీఆర్ ను కాపాడే ప్రయత్నం చేస్తుందన్నారు.వేల కోట్ల అవినీతికి కేసీఆర్ బాధ్యుడు..కేసీఆర్ అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మొన్నటి దాకా భారాస వ్యక్తే ముఖ్యమంత్రిగా ఉన్నారు.. అవినీతి చేసింది బీఆర్ఎస్ నేతలే అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి పదవి ఇస్తే అభివృద్ధి చేస్తామని హరీష్ రావు అనడం సిగ్గు చేటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కావాలని బీఆర్ఎస్ తపన పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు తలకాయ లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రెండు నెలలు కాకముందే ప్రభుత్వంపై విమర్శలు చేయడం బీఆర్ఎస్ పతనానికి పరాకాష్ట అన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్ల విషయంలో సుప్రీంకోర్టు తీర్పుని స్వాగతిస్తున్నామని, ఏ పార్టీ అధికారంలో ఉంటే వారికి ఎలక్ట్రోలు బాండ్ల రూపంలో నల్ల డబ్బు చేరుతుందన్నారు. ఈ దేశంలో బీజేపీకి, కాంగ్రెస్ పార్టీ లేకే ఎలక్ట్రోడ్లో బాండ్ల రూపంలో ఎక్కువ మొత్తంలో చేరిందన్నారు. కేంద్రం ఇచ్చిన హామీలను విస్మరించడంతో రైతులు ఆందోళన చేపట్టారన్నారు. దేవులను ఒక వైపు



పూజిస్తూ..మరో వైపు రైతులను చితకబాదుతున్నారని మండిపడ్డారు. మోదీకి ఏ దేవుడైన రైతులను చితక బాదమని చెప్పారా? అని ప్రశ్నించారు.పురాతనమైన దేవాలయాలను, మసీదులను మోదీ తొవ్విస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ పునాదులను తవ్వే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు గోతులు తొవ్వడమే అవుతుందని అన్నారు. మోదీ ప్రభుత్వం పట్ల ప్రజలు సానుకూల దృక్పథంతో ఉంటే .. ఎందుకు ఇతర పార్టీల ప్రభుత్వాలను కూలదొస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి జగన్ బానిస కాబట్టి ఆ ప్రభుత్వం జోలికి పోలేదన్నారు. కోడికత్తి పేరుతో జగన్ నాటకాలు అడార ఆరోపించారు. భారత దేశం చరిత్రలో బెయిల్ పై సుధీర్ఘకాలంగా బయట ఉన్న వ్యక్తి జగన్ అన్నారు. 17ఏ కేసు పెండింగ్ లో ఉంది కాబట్టి చంద్రబాబు కేంద్రానికి దాసోహం అంటున్నారని తెలిపారు. టిడిపి,వైసిపి రెండు పార్టీలు కేంద్రంలో భాజపాకు మద్దతు ఇస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మాత్రం కొట్లాడుకుంటూ పరోక్షంగా సహకరించుకుంటున్నాయని తెలిపారు. విభజన హామీలను ఒక్కటి కూడా కేంద్రం అమలు చేయలేదన్నారు. జగన్, చంద్రబాబు తమ తప్పులను కప్పిపుచ్చుకొనేందుకు తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని బిజెపి తాకట్టు పెట్టారని మండిపడ్డారు.

# లోక్‌సభలో ముగిసిన సోనియా శకం



న్యూఢిల్లీ,గత పాతికేళ్లుగా లోక్‌సభలో అత్యంత క్రియాశీలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఇప్పుడు రాజ్యసభను ఎంచుకున్నారు. రాజీవ్ మరణానంతరం ఎనిమిదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ సంక్షోభంలో ఉన్న సమయంలో ఆమె కాంగ్రెస్ పగ్గాలు చేపట్టారు.. పార్టీని రెండుసార్లు అధికారంలోకి తేవడంలో కీలక పాత్ర పోషించారు.. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా యూపీఏ ఛైర్‌పర్సన్‌గా రాజకీయాల్లో సోనియా గాంధీ ఎంతో హుందాగా వ్యవహరించారు. దాదాపు 25 ఏళ్ల పాటు వరుసగా లోక్‌సభ సభ్యురాలిగా పనిచేసిన ఆమె.. త్వరలో రాజ్యసభలో అడుగుపెట్టనున్న వేళ ప్రస్తుతం రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం గురించి సర్వత్రా చర్చ మొదలైంది. రాజస్థాన్ నుంచి ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ స్థానాలకు ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. అందులో ఒకటి కాంగ్రెస్‌కు దక్కనుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ఈ స్థానానికి ఎన్నిక జరుగుతోంది. ఈ స్థానం నుంచి సోనియా గాంధీ రాజ్యసభకు వెళుతున్నారు. బుధవారం నామినేషన్ వేశారు. నెహ్రూ కుటుంబంలో ఇందిరాగాంధీ తర్వాత రాజ్యసభకు వెళ్తున్న రెండో కుటుంబ సభ్యురాలిగా కూడా సోనియా గాంధీ నిలవబోతున్నారు. 15 రాష్ట్రాల్లోని 56 రాజ్యసభ సీట్లకు జరుగుతున్న ఈ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 27న జరగనుంది. మరోవైపు ఇప్పటివరకూ యూపీలోని రాయ్ బరేలీ సీటు నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలిచిన సోనియా ఈసారి రాజ్యసభను ఎంచుకోవడంతో ఆ స్థానంలో ఆమె కుమార్తె ప్రియాంక గాంధీ బరిలోకి దిగే అవకాశం ఉంది. సోనియా 1999లో తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేఠీ, కర్ణాటకలోని బళ్లారి లోక్‌సభ స్థానాల నుంచి ఏకకాలంలో పోటీ చేసి రెండింటా గెలుపొందారు. అమేఠీ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. 2004 ఎన్నికల్లో పార్టీ కంచుకోటగా ఉన్న రాయ్‌బరేలీకి మారారు. అప్పటి నుంచి లోక్‌సభకు ఎన్నికవుతూ వచ్చారు. అమేఠీలో రాహుల్ గాంధీ ఓటమి చవిచూసినా.. సోనియా మాత్రం తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. 2004, 2009 సార్వత్రిక ఎన్నికల్లో యూపీఏ కూటమిని అధికారంలోకి తీసుకురావడంలో సోనియా గాంధీ కీలక భూమిక పోషించారు. ఆ సమయంలో ప్రధాని పదవిని చేపట్టేందుకు అవకాశం ఉన్నప్పటికీ.. విపక్షాలకు ఆయుధం (ఇటలీ పౌరురాలు) కాకూడదన్న ఉద్దేశంతో పార్టీ వ్యవహారాలకే పరిమితమయ్యారు. గాంధీ కుటుంబం నుంచి వారసులుగా రాహుల్ గాంధీ మాత్రమే ప్రస్తుతం ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. 2019 ఎన్నికల్లో అమేఠీ నుంచి ఓటమి చవిచూసిన రాహుల్.. ప్రస్తుతం కేరళలోని వయనాడ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోవైపు పార్టీ పదవుల్లో కొనసాగుతున్నప్పటికీ. ప్రియాంక గాంధీ మాత్రం ఇప్పటివరకు ఎన్నికల బరిలో నిలవలేదు. ఆమె రాజకీయ రంగ ప్రవేశంపై ఎప్పటికప్పుడు ప్రచారం జరిగినా.. అవేవీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు సోనియా గాంధీ రాజ్యసభకు వెళుతున్న వేళ.. ప్రియాంక గాంధీ పొలిటికల్ ఎంట్రీపై ఊహాగానాలు జోరందుకున్నాయి. రాయ్‌బరేలీ నుంచి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బరిలో నిలిచే అవకాశాలు ఉన్నాయంటూ వార్తలు వెలువడుతు న్నాయి. మరోవైపు వయోభారం, అనారోగ్య కారణాల రీత్యా సోనియాగాంధీ లోక్‌సభ సీటును వదులుకుంటున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక పోటీ విషయంలో కాంగ్రెస్ పార్టీ త్వరలో నిర్ణయం ప్రకటించనుంది.

# అబ్దుల్లాతో చర్చలు జరుపుతున్నాం




న్యూఢిల్లీ,ఎన్‌సీ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ స్పందించారు. అబ్దుల్లాతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. ప్రతిపక్షానికి వారి స్వంత పరిమితులు ఉంటాయని పేర్కొన్నారు. ఇండియా కూటమిలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ కూడా ఒక భాగమని గుర్తుచేశారు. కలిసి చర్చించుకుని ముందుకు సాగుతామని జైరాం రమేష్ స్పష్టం చేశారు. మోడీ సర్కార్‌ను ఎదుర్కొనేందుకు విపక్ష పార్టీలన్నీ ఇండియా కూటమిని ఏర్పాటు చేశాయి. కానీ సార్వత్రిక ఎన్నికల ముందు మాత్రం ఎవరికి వారే యమునా తీరు అన్నట్టుగా ముందుకు సాగుతున్నారు. ఓట్లు చీలకూడదన్న భావనతో కూటమి ఏర్పాటు చేశారు గానీ.. ఆ దిశగా మాత్రం కూటమి శైలి ఉండడం లేదు. మరీ ఎన్నికల సమయానికైనా సర్దుకుంటుందా? లేదంటే ఇలానే ముందుకు సాగుతుందో వేచి చూడాలి. కాగా సార్వత్రిక ఎన్నికల ముందు ఇండియా కూటమికి దెబ్బ మీద దెబ్బలు తగలుతున్నాయి. ఇప్పటికే కూటమిలోని పార్టీలు ఎవరి దారి వారిదే అన్నట్టుగా సొంత నిర్ణయాలతో ముందుకు పోతున్నాయి. ఇక బీహార్‌లో అయితే ఇండియా కూటమి నుంచి జేడీయూ అధినేత నితీష్‌కుమార్ బయటకు వెళ్లిపోయి ఎన్డీఏతో జత కట్టారు. మరికొన్ని పార్టీలు తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ, ఆప్ ఒంటరిగానే బరిలోకి దిగుతామని ప్రకటించేశాయి. ఇప్పుడు ఈ కోవలోకి మరో పార్టీ వచ్చి చేరింది. ఇండియా కూటమిలో కీలక మద్దతుదారుగా ఉన్న జమ్మూ కాశ్మీర్ నేత ఫరూఖ్ అబ్దుల్లాకి చెందిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ కూడా ఒంటరి పోరుకు సిద్ధమైంది. వచ్చే ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించింది. ఇతర రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకోకుండా.. మంచి విజయాన్ని సాధిస్తామని ఫరూఖ్ అబ్దుల్లా స్పష్టం చేశారు. ఇకపోతే గత నెలలో ఫరూఖ్ అబ్దుల్లా సీట్ల షేరింగ్‌పై ఏకాభిప్రాయం కుదరకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మనం దేశాన్ని రక్షించాలంటే.. విభేదాలను ప్రక్కన పెట్టి దేశం గురించి ఆలోచించాలన్నారు. కానీ ఇంతలోనే ఆయన షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు.

# ఆందోళనలో ఫిజికల్ డైరెక్టర్ అభ్యర్థులు..!

హైదరాబాద్, గురుకుల స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీలో గోల్‌మాల్ జరిగినట్టు తెలుస్తున్నది. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని, జోన్ పోస్టులను మల్టీజోనల్‌గా నింపినట్లు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. నోటిఫికేషన్‌కు విరుద్ధంగా అనర్హులను ఎంపిక చేసినట్టు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో మొత్తం తొమ్మిది క్యాటగిరీల్లో అంటే పీజీటీ 1,276, టీజీటీ 4,020, జూనియర్ డైరెక్టర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్ 2,876, టీజీటీ స్కూల్ లైబ్రేరియన్ 434, స్కూల్ ఫిజికల్ 275, స్కూల్ ఫిజికల్ 275 24 పోస్టులు.. ఇలా 9,231 పోస్టుల భర్తీ ప్రక్రియను తెలంగాణ రెసిడిన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్ డిగ్రీ మొత్తం రిక్రూట్‌మెంట్ బోర్డు(ట్రిబ్) చేపట్టింది. వాటిలో టీజీటీ, స్కూల్ పీడీ, లైబ్రేరియన్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్టులు జోనల్ పోస్టులు కాగా, గురుకుల డీఎల్, జేఎల్, పీజీటీ పోస్టులు మల్టీ జోన్ పోస్టులు. అందుకనుగుణంగానే ట్రిబ్ జోనల్ పోస్టులకు అభ్యర్థుల నుంచి జోన్లవారీగా, సొసైటీలవారిగా ఆప్షన్లను ట్రిబ్ స్వీకరించింది. కానీ, ప్రస్తుతం జోన్‌లో పోస్టుల భర్తీని అందుకు విరుద్ధంగా అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై ట్రిబ్‌ను సంప్రదించినా కనీస స్పందన కరువైందని వాపోతున్నారు. దీంతో ‘నమస్తే తెలంగాణ’ను సంప్రదించి అనేక మంది అభ్యర్థులు తమ గోడు వెల్లబోసుకున్నారు. రాష్ట్రపతి ప్రకారం జోన్/సొసైటీలోని పోస్టుల్లో 95 శాతం లోకల్ వారికి, ఐదు శాతం నాన్‌లోకల్ వారికి కేటాయించాల్సి ఉంటుంది. ఇక జోన్‌ను యూనిట్‌గా తీసుకున్నా, జిల్లాను యూనిట్‌గా తీసుకున్నా, యూనిట్‌గా తీసుకున్నా ఇదే నిబంధనను పాటించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆదేశాలు కూడా ఉన్నాయి. కానీ, ప్రస్తుతం ట్రిబ్ అందుకు విరుద్ధంగా జోనల్ పోస్టులను భర్తీచేసినట్టు తెలుస్తున్నది. గురుకుల స్కూల్ ఫిజికల్ పోస్టు జోనల్ పోస్టు డైరెక్టర్‌గా నిర్ధారించారు. అన్ని జోన్లు, సొసైటీలు కలిపి మొత్తం 275 పోస్టులు ఉన్నాయి. ఇక్కడ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం జోన్‌నే కాకుండా సొసైటీని యూనిట్‌గా తీసుకుని పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. సొసైటీల వారిగానే కాకుండా, జోన్లవారిగా చూసుకున్నా నాన్‌లోకల్ అభ్యర్థులకు ఒక్క పోస్టు కూడా దక్కదు. కానీ ఏకంగా ఆరు నాన్‌లోకల్ అభ్యర్థులకు ట్రిబ్ పోస్టింగ్‌లు ఇచ్చామని అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరుగురు కూడా ఏపీకి చెందినవారుకావడంపై భగ్గుమంటున్నారు. ఒక జోన్‌లో 20 పోస్టులకు పైబడి ఉంటేనే నాన్‌లోకల్‌కు ఒక పోస్టు వచ్చే అవకాశముందనేది అభ్యర్థుల వాదన. అలా చూసినా కూడా నాన్‌లోకల్ అభ్యర్థులకు ఒక్క పోస్టు కూడా వచ్చే అవకాశం లేదు. కానీ, ఏకంగా ఏపీకి చెందిన ఆరుగురిని నాన్‌లోకల్ అభ్యర్థులుగా ట్రిబ్ ఎంపిక చేసిందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. మొత్తంగా జోన్ల వారిగానే నాన్‌లోకల్ అభ్యర్థులకు పోస్టింగ్‌కు అవకాశం లేకపోగా, జోన్‌లోని



సొసైటీలవారిగా చూస్తే ఎంతమాత్రం అవకాశం లేదు. కానీ, ట్రైబల్ వెల్‌ఫేర్ సొసైటీలో ఏకంగా రెండు పోస్టులను నాన్‌లోకల్ అభ్యర్థులతో భర్తీ చేసిందని, ఇదేలా సాధ్యమైందని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. జోనల్ పోస్టులైన స్కూల్ పీడీ పోస్టులను కూడా మల్టీ జోన్ పోస్టులుగానే భావించి ట్రిబ్ భర్తీ చేసిందని అభ్యర్థులు వాదిస్తున్నారు.

జాబితాలో అనర్హులు

వాస్తవంగా స్కూల్ పీడీ పోస్టులకు ట్రిబ్ గత ఏప్రిల్ 24 నుంచి మే 24 వరకు దరఖాస్తులను స్వీకరించింది. నోటిఫికేషన్ ప్రకారం 5 ఏప్రిల్ 2023 నాటికి పీడీ పోస్టులకు సంబంధించిన అన్ని పరీక్షలు పాసైన అభ్యర్థులే అర్హులని ప్రకటించారు. ఆ లెక్కనే గత మే నాటికే అభ్యర్థులు ఆయా విద్యార్హతలను సాధించి ఉండాలి. కానీ, ప్రస్తుతం ట్రిబ్ నోటిఫికేషన్‌కు విరుద్ధంగా గత అక్టోబర్‌లో పాసైన అభ్యర్థికి పోస్టింగ్ ఇచ్చిందని అభ్యర్థులు వెల్లడిస్తున్నారు. చార్మినార్‌లో జోన్‌లో పీడీ పోస్టుకు అభ్యర్థి (హాల్ టిక్కెట్ నంబర్ 2302070434) నోటిఫికేషన్ సమయానికి బీపీఎడ్ ఉత్తర్ణులు కాలేదు. గత అక్టోబర్‌లో నిర్వహించిన బ్యాక్‌లాగ్ సెమిస్టర్‌లో ఉత్తీర్ణత సాధించాడు. కానీ, ప్రస్తుతం ట్రిబ్ పోస్టింగ్ ఇచ్చింది. దరఖాస్తు ట్రిబ్ అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎంత మంది ఉన్నారోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. డెమో మార్కులను ట్రిబ్ అధికారులు ఇష్టారాజ్యంగా వేశారని పీడీ అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

## 4 శాతం తగ్గిన దరఖాస్తులు

లండన్, ఉన్నత చదువుల కోసం యూకేకు వెళ్లటానికి భారతీయులు ప్రస్తుతం ఆసక్తి కనబర్చటం లేదు. విశ్వవిద్యాలయాలు, కళాశాలల అడ్మిషన్స్ సర్వీస్ (యూసీఏఎస్) తాజాగా విడుదల చేసిన ఘటనలో ఈ విషయం వెల్లడైంది. బ్రిటన్‌కు ఉన్నత చదువుల కోసం వచ్చే అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 0.7

# ఐదేళ్లు అధికారాన్ని ఇస్తే ఏం చేశారు




అమరావతి,ఏపీలో రాజధాని అంశంపై విపక్షాలు భగ్గమంటున్నాయి. మరో మూడు నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల జరగనున్నాయి. ఈ తరుణంలో రాజధాని వ్యవహారం తీవ్ర చర్చగా మారింది. విపక్షాలకు ఈ రాజధాని వ్యవహారం టార్గెట్‌గ మారింది. అందుకు ప్రత్యామ్నాయంగ వైసీపీ ప్రభుత్వం విశాఖ రాజధాని కట్టుకునే వరకూ హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని కోరారు. ఈ ప్రత్యామ్నాయం విపక్షాలకు మరో అస్త్రంగా మారింతోంది. దీనిపై ప్రతిపక్షాలు ఇప్పటికే తీవ్రంగా స్పందించాయి. ఈ నేపథ్యంలో ఏపీ కాంగ్రెస్ పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల కూడా విమర్శంచారు. ఉమ్మడి రాజధాని హైదరాబాద్ మరో రెండేళ్లు కావాలని అడుగుతున్నారు అంటు ఆమె మండిపడ్డారు. ఇన్నాళ్లు మీరు గుడ్డి గుర్రాలకు పళ్లు తోమారా? అని విమర్శంచారు. కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి రాలేదని.. ఉన్నవి కూడా ఉంటాయో, లేదో తెలియని పరిస్థితి ఉందని ఆమె అన్నారు. రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులాంధ్రప్రదేశ్ గా మార్చారని ఆవేధన వ్యక్తం చేశారు.ప్రధాని మోదీకి మోకరిల్లి రాష్ట్ర ప్రయోజనాలను వైసీపీ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని షర్మిల విమర్శించారు. విభజన హామీలపై ఏనాడూ నోరు విప్పలేదని దుయ్యబట్టారు. ప్రజలు మీకు ఐదేళ్లు అధికారాన్ని అందిస్తే.. మీ చేతకానితనానికి విభజన హామీల్లో ఒక్కటంటే ఒక్క కూడా అమలు కాలేదని దుయ్యబట్టారు. ప్రత్యేక ప్యాకేజీలు లేదు, పోలవరం పూర్తి కాలేదు మరి ఐదేళు ఏం చేశారని అన్న జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కనీసం జలయజ్ఞం పెండింగ్ ప్రాజెక్టులకు కూడా దిక్కులేదని షర్మిల అన్నారు. అమరావతి పేరుతో చంద్రబాబు చూపించింది త్రీడీ గ్రాఫిక్స్ అయితే.. ఇప్రుడు జగన్ మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడుతునారు అన్నారు. పూటకో మాట,రోజుకో వేషం వేసే వైసీపీ నేతల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఉమ్మడి రాజధాని అంశం తెరపైకి తెచ్చరన్నారు. రాజధాని వైఫల్యంతో ఓటమి ఖాయమని తెలిసి ప్రజలను మభ్యపెడుతునారు అన్నారు. జగన్ ప్రభుత్వానికి రాజధానిపై,రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని షర్మిల పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com